www.samasamajam.in

# సమ సమాజం

ప్రశ్నించే అక్షరం... ప్రజలకోసం... తెలుగు దిన పత్రిక

తెలంగాణ | శుక్రవారం, 23 సెప్టెంబర్ 2022 | ఎడిటర్ : గోసుకొండ పృథ్విరాజు | సంపుటి - 07, సంచిక-156 | పేజీలు - 4 వెల రూ. 5/-

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Karimnagar, Warangal, Mahaboobnagar, Kammam, Medak

## కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష ఎన్నిక

నోటిఫికేషన్ విడుదల..24 నుంచి నామినేషన్లు

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 22 (సమ సమాజం):** కాంగ్రెస్ అధ్యక్ష పదవి ఎన్నికకు గురువారం నోటిఫికేషన్ విడుదలైంది. ఈ నెల 24 నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమవుతుంది. అక్టోబరు 1న నామినేషన్ పత్రాల పరిశీలన జరుగుతుందని, నామినేషన్ల ఉపసంహరణకు తుది గడువు అక్టోబరు 8గా నిర్ణయించారు. పోటీలో ఒకరు కంటే ఎక్కువ మంది ఉంటే అక్టోబరు 17న ఎన్నిక జరుగుతుంది. 19న ఫలితాలు విలువడనున్నాయి. కాంగ్రెస్ పార్టీ బాధ్యతల స్వీకరణకు రాహుల్ గాంధీ విముఖత చూపడంతో ఎన్నిక అనివార్యమైంది. కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నికల్లో అశోక్ గెహ్లాత్ , శశిథరూర్ బరిలో దిగుతారని ప్రచారం జరుగుతోంది. కాగా అధ్యక్ష ఎన్నికల్లో 9వేల మంది ప్రతినిధులు ఓటు హక్కు 2లో



## ఉగ్రవాదులుగా మార్చేలా శిక్షణ

శిక్షణ సంస్థలకు నిధుల సమకూర్పు

పది రాష్ట్రాల్లో పిఎఫ్ఐ కార్యాలయాల్లో సోదాలు

దాదాపు వందమంది వ్యక్తుల అరెస్ట్

కేంద్రహోం శాఖ పర్యవేక్షణలో ఎన్ఐఎ దాడులు

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 22 (సమ సమాజం):** దేశవ్యాప్తంగా జాతీయ దర్యాప్తు సంస్థ ఎన్ఐఏ సోదాలు నిర్వహిస్తుంది. 10 రాష్ట్రాల్లో ఈ సోదాలు జరుగుతున్నట్లు సమాచారం. దేశంలో ఉగ్రవాద కార్యకలాపాలకు నిధుల కేసులో పాపులర్ ఆఫ్ ఇండియా కార్యాలయాలపై ఎన్ఐఏ సోదాలు నిర్వహించింది. ఉగ్రవాదులకు నిధులు సమకూర్చడం, శిక్షణా శిబిరాలు ఏర్పాటు చేయడం, ఉగ్ర సంస్థల్లో చేర్చేందుకు సమాయత్తం చేయడం వంటి అసాంఘిక కార్యకలాపాలను పాల్పడుతున్న 100 మంది పీఎఫ్ఐకి చెందిన కార్యకర్తలను అరెస్ట్ చేశారు. ఈ దాడులు ఉత్తర్‌ప్రదేశ్, కేరళ, 2లో

## విద్యకు మించిన సంపద మరోటి లేదు

గిఫ్ట్ ఎ స్మైల్ కింద ట్యాబ్స్ పంపిణీ చేసిన కెటిఆర్

**రాజన్నసిరిసిల్ల, సెప్టెంబర్ 22 (సమ సమాజం):** విద్య, విజ్ఞానానికి మించిన సంపద మరొకటి లేదని మంత్రి కేటీఆర్ అన్నారు. రాష్ట్రంలో విద్యా ప్రమాణాలు పెంచేలా కృషిచేస్తున్నామని వెల్లడించారు. విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను వెలికితీసే ప్రయత్నం చేస్తున్నామన్నారు. ప్రస్తుతం పేద విద్యార్థులకు ట్యాబ్‌లెట్స్ అందిస్తున్నామని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా ఆరు వేల మంది ఇంటర్ విద్యార్థులకు ట్యాబ్‌లెట్స్ పంపిణీ చేస్తున్నాని వెల్లడిచారు. కొత్త ఆలోచనలతో పైకి ఎదగాలనే తపన ఉన్న విద్యార్థులకు కచ్చితంగా ప్రోత్సాహం అందిస్తామన్నారు. విద్య, విజ్ఞానానికి మించిన సంపద మరొకటి లేదని చెప్పారు. విదేశాల్లో విద్యనభ్యసించే వారికోసం ఓవర్సీస్ స్కాలర్‌షిప్ కింద రూ.20 లక్షలు ఇచ్చే ప్రభుత్వం ఏదైనా ఉందంటే అది తెలంగాణ సర్కారేనని స్పష్టం చేశారు. 'మన ఊరు-మన బడి' కింద స్కూళ్లలో మరమ్మతులు చేశామని తెలిపారు. సిరిసిల్లలో గిఫ్ట్ ఏ స్మైల్ కింద విద్యార్థులకు మంత్రి కేటీఆర్ ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఈ 2లో



## కాంగ్రెస్ పార్టీలో ఎన్నికల హడావిడి

పిసిసిల తీర్మానాలను రాహుల్ అంగీకరించేనా

గెహ్లాట్ అధ్యక్షుడయితే ఉపయోగమేమి ?

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 22 (సమ సమాజం):** రాహుల్ అస్త్ర సన్యాసం చేసిన తరవాత కాంగ్రెస్ పరిస్థితి దారుణంగా మారింది.ఈ క్రమంలో ఎవరినో ఒకరిని అధ్యక్షుడిగా చేయాలన్న సంకల్పతంలో సోనియా నిర్ణయాలు తీసుకుంటున్నట్లు అర్థం అవుతోంది. ఈ క్రమంలో రెండు దశాబ్దాల తరవాత కాంగ్రెస్‌లో అధ్యక్ష ఎన్నికల వేడి 3లో

## జింఖానా మైదానం వద్ద తీవ్ర ఉద్రిక్తత

టీ ట్వంటీ మ్యాచ్ టిక్కెట్ల కోసం ఎగబడ్డ అభిమానులు

అంచనాకు మించి వచ్చిన జనంతో పోలీసల హైరానా

కంట్రోల్ చేసే క్రమంలో లాఠీలకు పనిచెప్పిన పోలీసులు

హెచ్‌సిఎ తీరుపై పోలీసులు, అభిమానుల ఆగ్రహం

టిక్కెట్లు విక్రయం నిలిపివేత... అభిమానుల గెంటివేత

**హైదరాబాద్, సెప్టెంబర్ 22 (సమ సమాజం):** ఆదివారం 2లో





## జాతీయ రహదారుల వెంట మొక్కలు నాటాలి

బయో ఇథనాల్‌లో వాహనాల కాలుష్యానికి చెక్

రాజమండ్రిలో పలు ఫ్లై ఓవర్లకు గడ్కరీ శంకుస్థాపన

**రాజమండ్రి, సెప్టెంబర్ 22 (సమ సమాజం):** జాతీయ రహదారుల వెంబడి పెద్ద మొత్తంలో మొక్కలు నాటి వాతావరణాన్ని కాలుష్యరహితంగా మార్చాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ పిలుపునిచ్చారు. చక్కెర ద్రావకం నుంచి బయో ఇంధనాన్ని తయారుచేసేందుకు కేంద్రం ప్రణాళికలు సిద్ధం చేసిందని చెప్పారు. అలాగే, మొలాసిస్, నూకల నుంచి బయోఇథనాల్ తయారుచేయడానికి చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. 2లో

## ఖమ్మంలో మరో ఇంజెక్షన్ హత్య

భార్యను హత్యచేసిన భర్త

సిసి పుటేజ్ పరిశీలనతో వెలుగు చూసిన ఘటన

**ఖమ్మం, సెప్టెంబర్ 22 (సమ సమాజం):** ఇంజెక్షన్ హత్య ఘటన మరువక ముందే.. మరోసారి అలాంటి ఘటనే ఖమ్మం ఆసుపత్రిలో చోటుచేసుకుంది. ఓ మహిళకు ఇంజక్షన్ ఇచ్చి చంపారు. ముందు ఘటనలో భర్తను భార్య చంపిస్తే.. ఇక్కడ భర్త తన భార్యకు ఇంజెక్షన్ ఇప్పించి కాటికి పంపాడు. రెండు చోట్ల ఇంజక్షన్‌తోనే హత్య చేశారు. ఈ ఇంజక్షన్ దారుణం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఖమ్మం రూరల్ మండలం పెద్దతండాకు చెందిన భిక్షం అనే వ్యక్తి అనస్థీసియా వైద్యుడి వద్ద 2లో

జాతీయ ఆరోగ్య సూచీలో

# తెలంగాణ మూడవ స్థానం

ప్రభుత్వ చర్యలతో మారిన ఆస్పత్రుల తీరు ■ సౌకర్యాల కల్పనతో పాటు సిబ్బంది భర్తీ

**హైదరాబాద్, సెప్టెంబర్ 22 (సమ సమాజం):** రాష్ట్రంలో ఆస్పత్రులు నేడు పూర్తిగా మారిపోయాయి. ప్రభుత్వ వైద్యంపై ప్రజలకు నమ్మకం, విశ్వాసం పెరిగింది. సీఎం కేసీఆర్ తీసుకుంటున్న చర్యలతో రాష్ట్రం ఆరోగ్య తెలంగాణాగా ఆవిర్భావం చెందుతున్నది. గత ఎనిమిదేళ్లలో ప్రభుత్వం చేపట్టిన బహుముఖ చర్యల కారణంగా జాతీయ ఆరోగ్య సూచికల్లో 3వ స్థానానికి చేరుకుందని ఆరోగ్యశాఖ వెల్లడించింది. ఆరోగ్య సబ్ సెంటర్ల నుంచి ప్రాథమిక, ఏరియా, జిల్లా, బోధన, రాష్ట్రస్థాయి ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఆధునిక వైద్య సేవలను ప్రభుత్వం పటిష్టపరిచింది. ప్రభుత్వ ఉచిత వైద్య సేవలు, టెస్ట్ లను విస్తృతం చేసేందుకు వ్యవస్థాపరమైన వసతులను అభివృద్ధి చేసింది. దీంతో పేదలు, మధ్యతరగతి ప్రజలకు మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి. ముఖ్యమంత్రి ఆకాంక్షలకు అనుగుణంగా పౌరుల ఆరోగ్య స్థితి మెరుగుపడింది. ముఖ్యంగా మహిళలు, పిల్లలు ముఖ్య ఆరోగ్య సూచికల్లో గణనీయ ప్రగతి కనిపిస్తున్నది. రాష్ట్రం ఏర్పడక ముందు 92గా ఉన్న మాతృ మరణాల రేటు నేడు 56కు తగ్గింది. శిశు మరణాల రేటు 39 నుంచి 21కి తగ్గింది. 5 సంవత్సరాలలోపు వయస్సు ఉన్న పిల్లల మరణాల రేటు (జాఓఖీ) 41 నుంచి 30కు, నవజాత శిశు మరణాల రేటు 25 నుంచి 17కి తగ్గింది. 3లో



## మునుగోడు కోసమే గిరిజన బంధు

ఎన్నికల స్టంట్‌గా అభివర్ణించిన ప్రవీణ్ కుమార్



**యాదాద్రిభువనగిరి,సెప్టెంబర్ 22 (సమ సమాజం):** తెలంగాణలో దోపిడీ పాలన, గడీల పాలన పోతేనే బహుజనల బతుకులు మారుతాయని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం తూప్రాన్ పేట గ్రామంలో పర్యటించిన ప్రవీణ్ కుమార్.... ఆదివాసులను, గిరిజనులను మోసం చేయడానికే గిరిజన బంధు పథకమన్నారు. 2014, 18 ఎన్నికల్లో కేసీఆర్ కు గిరిజనులు ఎందుకు గుర్తు రాలేదని ప్రశ్నించారు. ఉప ఎన్నిక కోసమే గిరిజన బంధు పథకం తీసుకొచ్చారని ఆరోపించారు. 3లో

## కాంగ్రెస్‌లో ఒకరికి ఒకపదవి మాత్రమే

మరోమారు స్పష్టం చేసిన రాహుల్ గాంధీ



**తిరువనంతపురం, సెప్టెంబర్ 22 (సమ సమాజం):** కాంగ్రెస్ అధ్యక్ష పదవీ కేవలం సంస్థాగతమైన పదవి మాత్రమే కాదని.. అది దేశానికి ప్రాతినిధ్యం వహించడమని కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ పేర్కొన్నారు. కాంగ్రెస్ అధ్యక్ష పదవి ఒక భావజాలాన్ని, విశ్వాసాన్ని, దేశ దృక్కోణాన్ని ఆవిష్కరిస్తుందని అన్నారు. అధ్యక్ష బాధ్యతలు చేపట్టే వారు వీటిని దృష్టిలో పెట్టుకోవాలని సూచించారు. అలాగే ఉదయ్ పూర్ 'చింతన్ శిబిర్‌లో 'ఒక వ్యక్తికి ఒకే పదవి' అనే సిద్ధాంతానికి మద్దతు ఇచ్చామని... ఇది కొనసాగుతుందని ఆశిస్తున్నట్లు రాహుల్ గాంధీ కేరళలో చెప్పారు. ఆయన జోడో యాత్ర అక్కడే కొనసాగుతోంది. దీంతో 2లో

## దేశంలో నెంబర్‌వన్ స్థాయికి విజయ డెయిరీ

మార్కెట్‌తో పోటిపడి డెయిరీ ఉత్పత్తుల అమ్మకాలు

మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్ వెల్లడి



**హైదరాబాద్, సెప్టెంబర్ 22 (సమ సమాజం):** విజయ డెయిరీని దేశంలోనే నెంబన్ వన్ స్థానానికి తీసుకెళ్తామని రాష్ట్ర పశు సంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. మార్కెట్‌తో పోటీపడి డెయిరీ ఉత్పత్తులు అందుబాటులోకి తీసుకొస్తున్నామని మంత్రి తెలిపారు. నగరంలోని ఎన్‌టీఆర్ పార్క్, లుంబినీ పార్క్‌ల వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన విజయ ఐస్ క్రీమ్ పార్లర్లను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..నష్టాల్లో ఉన్న విజయ డెయిరీని తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత అభివృద్ధి పథంలో నడుస్తుందన్నారు. రూ.750 కోట్ల టర్నోవర్‌తో దూసుకెళ్తుందన్నారు. గతంలో విజయ డెయిరీ ఉత్పత్తులు అందరికి అందుబాటులోకి తీసుక రాలేదు. ఇప్పుడు 1000 అవుట్ లెట్స్ ఎర్పాటు చేయడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని మంత్రి తెలిపారు. వేలాది మంది నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాం. రాష్ట్రంలో ఉన్న పాల ఉత్పత్తి దారులతో సమావేశం ఎర్పాటు చేశాం. పాల సేకరణ ధరను లీటర్‌కు 5 రూపాయలు పెంచామని గుర్తు చేశారు. అన్ని పాల ఉత్పత్తులు విజయ డెయిరీలో దొరుకుతాయన్నారు. కార్యక్రమంలో ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినిపల్లి వినోద్ కుమార్, తదితరులు ఉన్నారు.

## బతుకమ్మ గీతాన్ని ఆవిష్కరించిన కవిత



**హైదరాబాద్, సెప్టెంబర్ 22 (సమ సమాజం):** బతుకమ్మ పండుగ సందర్భంగా 'సిరిమల్లెలో రామ రఘుమెల్లెలో' అనే బతుకమ్మ ప్రత్యేక గీతాన్ని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత గురువారం ఆవిష్కరించారు. హైదరాబాద్‌ని తన నివాసంలో ఆవిష్కరించిన అనంతరం ఆమె 2లో

## కెటిపిఎస్‌లో కార్మికులకు ఇంత అన్యాయమా ?

ఆర్టిజన్స్‌గా నియమిస్తామన్న హామీ ఏమయ్యింది

సిఎం కెసిఆర్‌కు రేవంత్ రెడ్డి బహిరంగ లేఖ



**హైదరాబాద్, సెప్టెంబర్ 22 (సమ సమాజం):** కేటీపీఎస్ 6వ దశ నిర్మాణంలో పాలుపంచుకున్న కార్మికులను ఆర్టిజన్స్‌గా నియమించకపోవడంపై ముఖ్యమంత్రి కేసీఆర్ కు టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి బహిరంగ లేఖ రాశారు. కేటీపీఎస్ 6వ దశ నిర్మాణంలో 2008 నుంచి 2013 వరకు పాలుపంచుకున్న వారిని ఆర్టిజన్స్‌గా నియమించుకుంటామని సంస్థ హామీ ఇచ్చిందని తెలిపారు. కానీ 6వ దశ నిర్మాణం పూర్తయిన్నప్పటికీ ఇంకా వారికి ఇచ్చిన మాటను నిలబెట్టుకోకపోవడం క్షమించరాని విషయమని అన్నారు. కేటీపీఎస్ 7వ దశ నిర్మాణ సమయంలో 6వ దశలో పాలుపంచుకున్న కార్మికులను ఆర్టిజన్స్‌గా తీసుకుంటామని సంస్థ సీఎండీ దేవులపల్లి ప్రభాకర్‌రావు రాత పూర్వకంగా హామీ ఇచ్చారని చెప్పారు. మీరు ఇటీవలి కాలంలో విద్యుత్ రంగంపై చెప్పుకుంటున్న గొప్పల వెనుక ఎంతో మంది కార్మికుల కష్టం దాగి ఉంది. వారి శ్రమకు మీ ప్రభుత్వం ఇచ్చిన బహుమతి మోసం అని మండిపడ్డారు. 7వ దశ నిర్మాణం సందర్భంగా చేపట్టిన 2లో

## సంపాదకీయం

### మోడీ ఉచ్చునుంచి కాంగ్రెస్ బయటపడాలి !

మోడీ వేసిన ఎత్తులతో కాంగ్రెస్ చిత్తవుతోంది. కాంగ్రెస్ ముక్త భారత్ అంటూ మోడీ లేవనెత్తిన నినాదంలో తనకుతానుగా బలవుతోంది. కాంగ్రెస్‌కు ఉన్న బలమే గాంధీ, నెహ్రూ కుటుంబం. వారి నుంచి వచ్చిన వ్యక్తులే పార్టీని కాపాడుకుంటూ ఇన్నేళ్లుగా అధికారం చెలాయించింది. కాంగ్రెస్ వారసత్వాన్నీ, సిద్ధాం తాన్నీ, ఆ పార్టీ నేతలను చరిత్ర పుటల్లోంచి తొలగించి తన సిద్ధాంతాన్ని, భావజాలాన్ని ప్రవేశపెట్టేందుకు బిజెపి పకడ్బందీగా పనిచేస్తోంది. కాంగ్రెస్ పార్టీకి ఓటు బ్యాంకు అయిన దళితులు, ఆదివాసీలను తన వైపుకు తిప్పుకునేందుకు, ఓబీసీలను ఆకర్షించేందుకు బిజెపి పద్ధతి ప్రకారం ప్రయత్నిస్తోంది. ప్రతి రాష్ట్రం లోనూ పలుకుబడిగల వివిధ వర్గాల నేతలు బిజెపిలో చేరేందుకు ఉత్సుకత ప్రదర్శిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ కానీ, ఆ పార్టీతో కలిసి పనిచేసే శక్తులు కానీ ఒక ప్రత్యామ్నాయ రాజకీయ సిద్ధాంతాన్ని పటిష్ఠం చేసుకుని దాన్ని జనంలో ఉధృతంగా ప్రవేశపెట్టనంతవరకూ ఆ పార్టీకి ఊపు వచ్చే అవకాశాలు లేవు. అందుకు సమర్థుడైన నేత అధ్యక్షస్థానంలో ఉండాలి. అతడు ఖచ్చితంగా ఇప్పుడున్న పరిస్థితుల్లో వారసుడై ఉండాలి.ఆ కుటుంబ సభ్యులు లేకుంటే కాంగ్రెస్ కుక్కలు చింపిన విస్తరికాక తప్పదు. దీనిని వారసత్వమని ఎవరు ఎన్ని అన్నా పెద్దగా పట్టించుకోవాల్సిన అవసరం లేదు. అలాగే గాంధీ వారసత్వం ఉన్న వారు పీఠంపై ఉంటేనే అందులోని నేతలు కిమ్మనకుండా ఉంటారు. పార్టీని నడిపిస్తారు. మంచి సలహాలు ఇస్తారు. పివి నరసింహారావు పార్టీని, ప్రభుత్వాన్ని బ్రహ్మాండగా నడిపినా..ఆయన వెనక గోతులు తీసారు. అర్జున్ సింగ్, సింధియా లాంటివారు ఎంతచేయాలో అంతా చేశారు. ఈక్రమంలో అధ్యక్ష ఎన్నికలకు వెళుతున్న కాంగ్రెస్ పార్టీ మోడీ పన్నిన వ్యూహంలో చిక్కుకోకుండా రాజకీయాలు నెరపాలి. రాహుల్ కాదంటే ప్రియాంకను అధ్యక్షురాలిని చేయాలి. నేతలను వెనక ఉండి నడిపేలా చేసుకోవాలి. యువరక్తాన్ని ఎక్కించాలి. ప్రియాంక కు ఛరిష్మా ఉంది. అది పార్టీకి ఎంతగానో ఉపయోగపడుతుంది. ఇలా ఆలోచన చేయాల్సిన కాంగ్రెస్..మోడీ వారసత్వ రాజకీయ విమర్శలకు తలొగ్గి ఎన్నికలు జరుపుకోవడం ద్వారా చేజేతులా పార్టీని మరింతగా దిగజార్చు కోవడమే తపప మరోటి కాదు. అలా ఎన్నికైన వారు రేపు మోడీ మాయలో పడరనే గ్యారెంటీ కూడా లేదు. రాజస్థాన్‌లో పాలన సక్రమంగా చేతగాని అశోక్ గెహ్లాట్ కానీ, దిగ్విజయ్ సింగ్ కానీ, శథిథరూర్ కానీ పార్టీని నడిపించే సత్తా ఉందనడానికి లేదు. వారి గత వ్యవహారాలను పరిశీలిస్తే ఇదే విషయం అర్థం అవుతోంది. వీరిలో ఏ ఒక్కరిని పార్టీ అధ్యక్షుడిగా పెట్టుకున్నా..ఉన్న కార్యకర్తల బలం కూడా పోతుంది. ఈ క్రమంలో రాహుల్‌ను పక్కన పెట్టి ఓ రెండేళ్లు అంటే వచ్చే ఎన్నికల వరకు ప్రియాంకను అధ్యక్షురాలిని చేస్తే.. మంచిది. ఆమెను ప్రజలు ఆదరిస్తున్నారా లేదా అన్నది చూడాలి. మొత్తంగా అధ్యక్ష ఎన్నికల కారణంగా కొద్దిరోజుల క్రితం నుంచీ దేశంలో ప్రతిపక్ష పార్టీ అయిన కాంగ్రెస్ వార్తల్లో ఉంటున్నది. రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీ, ఇతర సీనియర్ నేతలతో మంతనాలు జరపడం ఆ పార్టీ పట్ల జనం ఆసక్తిని ఏర్పర్చింది. చివరకు ప్రశాంత్ కిషోర్ కోరుకున్న హోదాను కల్పించేం దుకు కాంగ్రెస్ అధిష్టానం ససేమిరా అనడంతో ఆయన ఆ పార్టీలో చేరేందుకు నిరాకరించాడని వార్తలు వచ్చాయి. ఇప్పుడు ఆయన ఎలాగూ వదులుకుని వెళ్లారు. ఈ క్రమంలో కాంగ్రెస్ అధినేత్రి సోనియా మళ్లీ ఆలోచన చేయాలి. పార్టీలో అధ్యక్ష ఎన్నికల్లో ఇద్దరు పిల్లల్లో ఒకరిని పార్టీకి అధ్యక్ష బాధ్యతలు అప్పగిం చడమే మంచిది. అసలు వందేళ్లకు పైగా చరిత్ర ఉన్న కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు సోనియాగాంధీ, ఆమె తనయుడు రాహుల్ గాంధీ, తనయ ప్రియాంకాగాంధీతో సహా హేమాహేమిలందరూ ముందు చర్చించు కుంటే బాగుంటుంది. అయిదు రాష్ట్రాల ఎన్నికల్లో పరాజయం చెందిన తర్వాత, కాంగ్రెస్ పార్టీ భవిష్యత్ ప్రశ్నార్థకమైన తర్వాత దిక్కుతోచని స్థితిలో పార్టీ నేతలు ఉన్నారు. అధికారం ఉంటే పెత్తనం చెలాయించే నేతలు అధికారం లేకుంటే చప్పబడిపోతారు. ఆజాద్, కపిల్ సిబాల్ లాంటి వారు వెళ్లి పోయారు కనుక చురుకైన యువనేతలను గుర్తించి పార్టీ బలో పేతానికి చొరవ తీసుకోవాలి. సచిన్ పైలట్ లాంటి వారిని ముందు వరుసలో నిలపాలి. ప్రియాంకను అధ్యక్షురాలిగా చేసి...యువనేతలో ముందుకు సాగితే దేశంలోని యువత కూడా ఆలోచన చేస్తుంది.నిజానికి పార్టీ అధిష్ఠానం ప్రజలతోనూ, కార్యకర్తలతోనూ సంబంధాలు కోల్పోయింది. ఇప్పటికే కాంగ్రెస్ జాతీయ స్థాయిలో బిజెపితో రెండు యుద్దాలు చేసి ఓడిపోయింది. పోటీ చేసిన ప్రతి రాష్ట్రంలోనూ, ప్రతి ఎన్నికలోనూ పార్టీ దెబ్బతింటూ వస్తోంది. దేశంలో అతి పెద్ద రాష్ట్రం అయిన ఉత్తర ప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీ కేవలం 2.32 శాతం మాత్రమే సంపాదించింది. ఉత్తరాఖండ్‌లో అధికారంలో ఉన్న బిజెపిని ఓడించే పరిస్థితులు ఉన్నప్పటికీ గెలిపించగల నాయకత్వం లేదని రుజువు చేసుకుంది. పంజాబ్‌లో ఆఖరి రోజుల్లో ముఖ్యమంత్రిని తొలగించి, ఆచరణ సాధ్యం కాని ప్రయోగాలు చేసి కుప్పకూలిపోయింది. 2014లో కాంగ్రెస్ 13 రాష్ట్రాల్లో అధికారంలో ఉండేది. ఇప్పుడు కేవలం రెండు రాష్ట్రాలకే పరిమితమైంది. 2013కు ముందు 15 సంవత్సరాల పాటు కాంగ్రెస్ ఢిల్లీలో అధికారంలో ఉండేది. 2020 ఎన్నికల్లో ఆ పార్టీకి ఢిల్లీలో కేవలం 5 శాతం ఓట్ల కంటే తక్కువ వచ్చాయి. కాంగ్రెస్ ఇప్పటికీ మధ్య ప్రదేశ్, గుజరాత్, రాజస్థాన్, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, హర్యానా, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో ఎంతో కొంత బలంగా ఉన్నది. ఈ రాష్ట్రాల్లో గెలిచేం దుకు ఏమి చేయాలో ఆ పార్టీ తీవ్రంగా చర్చించవలిసి ఉన్నది. క్రిందిస్థాయి నుంచి పార్టీలో జవజీవాలు కల్పించాల్సి ఉన్నది. గ్రామస్థాయినుంచి పార్టీని బలోపేతం చేయాల్సి ఉంది. దళితులు, వెనుకబడిన వర్గాలు మళ్లీ కాంగ్రెస్ పట్టులోకి వచ్చేందుకు ఏమిచేయగలమో అన్నది ఆ పార్టీ నేతలు ఆలోచించాలి. కాంగ్రెస్ పార్టీ జనంలో కదలిక తేగలిగిన పరిస్థితి లో ఉన్నదా లేదా, తెచ్చేందుకు ఎలాంటి నిర్ణయాలు తీసుకోవాలి అని ఆ పార్టీ నేతలే చర్చించు కోవాలి.ఎందుకంటే దిగ్విజయ్ సింగ్‌నో లేదా, శశిథరూర్‌నో లేదా గెహ్లాట్‌నో ముందుకు నెడితే జనంలో కనీస స్పందన కూడా రాదు. జనం లో కదలిక రావాలంటే జనాన్ని ఆకర్శించే వ్యక్తి కావాలి. ఇప్పుడున్న పరిస్థితుల్లో రాహుల్ లేదా ప్రియాంక మాత్రమే జనానికి పరిచితులు. విచిత్రమేమంటే కాంగ్రెస్ పార్టీ తాను ఏమి చేయాలో తెలుసుకోలేని పరిస్థితి లో ఉన్నది. పూర్తిగా తనను ప్రక్షాళనం చేసుకొని, కాయకల్ప చికిత్స జరిపించుకుని జనంలోకి వెళ్లగలిగే నేతల్ని, కార్యకర్తల్ని తయారు చేసుకున్నప్పుడే కాంగ్రెస్ మళ్లీ ప్రత్యామ్నాయంగా ఎదగగలదు.

**పృధ్విరాజ్ గోసుకొండ**
**ఎడిటర్**

## కెటిపిఎస్‌లో కార్మికులకు ఇంత అన్యాయమా ?

(మొదటి పేజి తరువాయి) ప్రజాభిప్రాయ సేకరణలో కూడా సీఎండీ ఇదే విషయాన్ని పునరుద్ఘాటించారని రేవంత్ రెడ్డిగుర్తుచేశారు. సీఎండీ మాట మీద గౌరవంతో 7వ దశ నిర్మాణానికి కార్మికులు పూర్తిగా సహకరించారన్నారు. రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌కు కూడా ఇదే విషయాన్ని లిఖిత పూర్వకంగా తెలిపారన్నారు. ఇదంతా జరిగి ఐదేళ్లు అవుతున్నప్పటికీ కార్మికులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోకపోవడం అత్యంత దురదృష్టకరమన్నారు. మీరేమో ఇవేమీ పట్టన్నట్లు రాజకీయాలు చేస్తూ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుంటారని మండిపడ్డారు. పాలన ఈ విధంగా ఉంటే కార్మికుల సమస్యను తీర్చేదెవరని ప్రశ్నించారు. కేటీపీఎస్ 6వ దశ నిర్మాణ సమయంలో ఎన్నో ప్రమాదాలు చోటు చేసుకున్నా వాటిని లెక్క చేయకుండా పని చేసిన కార్మికుల కష్టాన్ని విస్మరించడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో సీఎండీ హామీ ఇచ్చిన విధంగా తక్షణమే కేటీపీఎస్ 6వ దశ నిర్మాణంలో పాలుపంచుకున్న కార్మికులను ఆర్టిజన్స్‌గా నియమించి వారికి ఉద్యోగ భద్రతను కల్పించాలంటూ డిమాండ్ చేస్తున్నట్లు రేవంత్ రెడ్డి లేఖలో పేర్కొన్నారు.

## ఉగ్రవాదులుగా మార్చేలా శిక్షణ

(మొదటి పేజి తరువాయి) తమిళనాడు సహా దేశ వ్యాప్తంగా 10 రాష్ట్రాల్లో గురువారం వేకువజామున జరిగాయి. ఆంధ్రప్రదేశ్ లోని కర్నూలు, గుంటూరు జిల్లాల్లో ఎన్ఐఏ అధికారులు తనిఖీలు చేస్తుండగా... తెలంగాణలో హైదరాబాద్, అదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్‌లలో సోదాలు చేపట్టారు. కరీంనగర్ లోనే ఏకంగా 8 చోట్ల తనిఖీలు జరుగుతున్నాయి. అంతేకాకుండా ఉత్తర్‌ప్రదేశ్, కేరళ, కర్ణాటక, తమిళనాడులలో కూడా తనిఖీలు నిర్వహిస్తున్నారు. పీఎఫ్ఐ, ఎస్‌డీపీఐ కార్యాలయాలు దాని అనుబంధ సంస్థలలో ఎన్ఐఏ బృందాలు తెల్లవారు జామునుండి సోదాలు చేస్తున్నారు. ఎస్ డి పి ఐ నేతలు అబ్దుల్ వారిస్, ఇంతియాజ్ ఇళ్లల్లో సోదాలు నిర్వహించారు. దేశ వ్యాప్తంగా ఇప్పటి వరకూ వందమందిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. దేశవ్యాప్తంగా పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా కార్యాలయాలు, సభ్యుల ఇళ్లపై ఎన్ఐఏ, ఈడీ అధికారులు దాడులు చేపట్టారు. ముఖ్యంగా టెర్రర్ ఫండింగ్, మిలిటెంట్లుగా మారేందుకు శిక్షణ శిబిరాలు నిర్వహించడం, నిషేధిత ఉగ్రసంస్థలో చేరేలా యువతను ప్రోత్సహించడం వంటి ఆరోపణపై దర్యాప్తులో భాగంగా దాడులు చేపట్టారు. హైదరాబాద్ చాంద్రాయణ గుట్టలోని పిఎఫ్ఐ హెడ్ ఆఫీసుకు అధికారులు సీల్ చేశారు. ఉప్పల్, ఘట్ కేసర్ ప్రాంతాల్లోని పీఎఫ్ఐ కార్యకర్తల నివాసాల్లో సోదాలు చేస్తున్నారు. కరీంగనర్ లోని 8 ప్రాంతాల్లో ఏకకాలంలో దాడులు చేపట్టారు. గుంటూరు లోని ఆటోనగర్ లో తనిఖీలు చేపట్టారు. కేరళలో 22 మందిని, కర్ణాటక, మహారాష్ట్రలో 20 మంది, తమిళనాడులో 10 మంది, అసోంలో 9 మంది, యూపీలో ఎనిమిది మందిని అరెస్టు చేశారు. ఏపీలో ఐదుగురు, మధ్య ప్రదేశ్ లో నలుగురు, పుదుచ్చేరి ముగ్గురు, ఢిల్లీల్లో ముగ్గరు , రాజస్థాన్ లో ఇద్దరిని అరెస్టు చేశారు. రెండు రోజుల క్రితం తెలంగాణలోని నిజామాబాద్, ఆంధప్రదేశ్‌లోని నెల్లూరులో ఎన్ఐఏ సోదాలు నిర్వహించి పలువురు పీఎఫ్ఐకి చెందిన వారిని అదుపులోకి తీసుకుంది. వీరిని హైదరాబాద్‌లో ప్రశ్నిస్తున్నారు. ఇప్పటి వరకు ఇవే అతిపెద్ద దాడులు. ఉగ్రవాదులకు నిధులు సమకూర్చడం, శిక్షణా శిబిరాలు నిర్వహించడం, నిషేధిత సంస్థలలో చేరడానికి వ్యక్తులను ప్రోత్సహించడం వంటి ఆరోపణలతో సోదాలు జరుగుతున్నాయి. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ స్వయంగా ఈ మొత్తం ఆపరేషన్‌ను పర్యవేక్షిస్తున్నట్లు సమాచారం. ఉగ్రవాద మూలాలు, శిక్షణ వంటి వ్యవహారాలు పెద్ద ఎత్తున దేశంలో బయటపడడం వల్ల హోం శాఖ దృష్టి సారించినట్లు తెలుస్తోంది.


## కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష ఎన్నిక

(మొదటి పేజి తరువాయి) వినియోగించుకోనున్నారు. పార్టీ అధ్యక్షుడి బాధ్యతలు తాను స్వీకరించనని ఇప్పటికే రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. దీంతో పార్టీ కోరుకుంటే అధ్యక్ష పదవికి నామినేషన్ దాఖలు చేస్తానని గెహ్లాత్ ప్రకటించారు. 1998 తర్వాత తొలిసారి కాంగ్రెస్ అధ్యక్ష పదవికి ఎన్నికలు జరుగుతున్నాయి. ఏఐసీసీ అధ్యక్షుడిగా సీతారాం కేసరిని ఎన్నుకున్న నేతలు.. మళ్ళీ ఇప్పుడు రాహుల్ గాంధీ అధ్యక్ష బాధ్యతలు స్వీకరించకపోవడంతో ఎన్నికలు అనివార్యమవుతున్నాయి.

## బతుకమ్మ గీతాన్ని ఆవిష్కరించిన కవిత

(మొదటి పేజి తరువాయి) మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతి ఉట్టిపడేలా బతుకమ్మ పాటను రూపొందించిన జెన్నారం జెడ్పీటీసీ ఎర్ర శేఖర్ బృందాన్ని అభినందించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను తెలంగాణ ప్రభుత్వం ఎంతో ప్రోత్స హిస్తుందన్నారు. కార్యక్రమంలో హోమ్ మినిస్టర్ మహమూద్ అలీ, రాష్ట్ర సంగీత నాటక అకాడమీ చైర్‌పర్సన్ దీపికారెడ్డి , ఉర్దూ అకాడమీ చైర్మన్ ముజీబ్, హాజ్ కమిటీ చైర్మన్ సలీం, టీఎస్ ఫుడ్స్ చైర్మన్ రాజీవ్ సాగర్ పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లో ఒకరికి ఒకపదవి మాత్రమే



(మొదటి పేజి తరువాయి) రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్ ఆశలపై నీళ్లు చల్లినట్లయింది. కాంగ్రెస్ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టినప్పటికీ.. రాజస్థాన్ ముఖ్యమంత్రిగాను కొనసాగుతానంటూ ఇటీవల గెహ్లాట్ ప్రకటించిన సంగతి తెలిసిందే. తాను అధ్యక్ష పీఠాన్ని చేపడితే.. తన ప్రత్యర్థి సచిన్ పైలెట్ సిఎం అవుతారని ఆయన భావిస్తున్నారు. రాహుల్ వ్యాఖ్యలతో.. అశోక్ గెహ్లాట్ అధ్యక్షుడైతే.. సిఎం పదవిని వదులకోక తప్పదని స్పష్టమైంది. కాంగ్రెస్ అధ్యక్ష పదవి కోసం ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కావడంతో పలువురు నేతల పేర్లు తెరపైకి వస్తున్నాయి. అధ్యక్ష పదవికి పోటీ చేస్తున్నట్లు ఇప్పటికే శశిథరూర్ ప్రకటించారు. తాజాగా సీనియర్ నేత దిగ్విజయ్ సింగ్ పేరు తెరపైకి వచ్చింది. మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి కమల్‌నాథ్, కేంద్రమంత్రులు మనీష్ తివారి, పృధ్వీరాజ్ చవాన్, ముకుల్ వాస్నిక్, మల్లికార్జున్ ఖర్గే, కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్యలు పేర్లు వినిపిస్తున్నాయి.

## మండిపడ్డ మంత్రిజగదీశ్ రెడ్డి

**యాదాద్రి భువనగిరి, సెప్టెంబర్ 22 (సమ సమాజం):** ప్రాధాని మోదీ, అమిత్ షాల దుష్ట ద్వయం తోటే మునుగోడుకు ఉప ఎన్నిక వచ్చి పడిందని విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి మండిపడ్డారు. సీఎం కేసీఆర్ హస్తినకు వచ్చి దేశరాజకీయాలను శాసిస్తారన్న భయం తోటే వారు ఇలాంటి కుట్రలకు తెర లేపారని ఆయన ఆరోపించారు. నారాయణ పురం మండల కేంద్రంలో జరిగిన టీఆర్ఎస్ పార్టీ కుటుంబ సభ్యుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో పాల్గొని మంత్రి మాట్లాడారు. తెలంగాణా ప్రజల ఆశీర్వాదమే సీఎం కేసీఆర్ బలమన్నారు. సంస్కృతి, సంప్రదాయాలకు తెలంగాణా పెట్టింది పేరు అని ఆయన చెప్పుకొచ్చారు.ఆత్మీయ సమ్మేళనాలు, వన భోజనాలు ఆ సంస్కృతిలో భాగామేనని ఆయన స్పష్టం చేశారు. బీజేపీ పై పోరుకు మునుగోడులో 70 వేల మంది గులాబీ దండు సన్నద్ధంగా ఉన్నారన్నారు. ఇక్కడ కాషాయం కుట్రలకు తావు లేదని ఆయన తేల్చిచెప్పారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్, ప్రభుత్వ విప్ గొంగిడి సునీతా మహేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు, ఎమ్మెల్యేలు కిశోర్ కుమార్, లింగయ్య, సైదిరెడ్డి, నియోజకవర్గ టీఆర్ఎస్ ఇంచార్జి కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి ఉన్నారు.



## ధాన్యాగారంగా మెదక్ జిల్లా

**5లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి**

**ర్యాక్ పాయింట్‌తో తీరిన ఎరువు కొరత**

**జిల్ల పరిషత్ సర్వభ్య సమావేశంలో మంత్రి హరీష్ రావు**

**మెదక్, సెప్టెంబర్ 22 (సమ సమాజం):** మెదక్ జిల్లా ధాన్యగార జిల్లాగా మారిందని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు అన్నారు. మెదక్‌కు ర్యాక్ పాయింట్ రావడం పట్ల ఎరువుల కొరత లేకుండా పోయిందన్నారు. . గతంలో లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరిస్తే ప్రస్తుతం 5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని పండిస్తు న్నామని అన్నారు. గురువారం జెడ్పీ చైర్‌పర్సన్ పర్సన్ హేమలత అధ్యక్షతన మెదక్ కలెక్టరేట్‌లో జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో పాల్గొని మాట్లాడారు. సీఎం కేసీఆర్‌కు ఉన్న సంకల్పంతో రైతులకు ఎన్నో పథకాలు ప్రవేశ పెడుతున్నారు. 1.35 కోట్ల ఎకరాల్లో పంటలు తెలంగాణలో పండుతున్నాయి. దేశంలోనే ఎక్కువ పంటలు పండుతున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అన్నారు. కేంద్ర ప్రభుత్వం ధాన్యం కొనం అని చెప్పినా తెలంగాణ ప్రభుత్వం ధాన్యాన్ని చివరి గింజ వరకు కొనుగోలు చేసిందన్నారు. వాస్తవాలను ప్రజలముందు ఉంచాల్సిన బాధ్యత ప్రజా ప్రతినిధులపై ఉందన్నారు. విత్తన సాగు పెంచేలా రైతులను ప్రోత్సహించాలి. పామాయిల్ తోటల పెంపకాన్ని ప్రోత్సహిస్తే రైతుకు డబుల్ ఆదాయం వస్తదని మంత్రి సూచించారు. ఆసరా పెన్షన్ల కు అర్హులైన వారు మిస్సయితే వెంటనే గుర్తించండి. సీఎం కేసీఆర్ ను ఒప్పించి ఇప్పించే బాధ్యత నాది అని భరోసానిచ్చారు. తెలంగాణ సర్కారు ప్రభుత్వ వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నది. త్వరలోనే మెదక్‌లో మెడికల్ కాలేజీ,400 పడకల హాస్పిటల్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే మెదక్‌ను మెడికల్ హబ్ గా మారుస్తామని మంత్రి స్పష్టం చేశారు. ఇతర రాష్ట్రాలకంటే ఎక్కువ పథకాలు మన రాష్ట్రంలో అమలవుతున్నాయని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు పద్మా దేవేందర్ రెడ్డి, మదన్ రెడ్డి, ఎమ్మెల్సీ సుభాష్ రెడ్డి, జిల్లా కలెక్టర్ హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

## ఖమ్మంలో మరో ఇంజెక్షన్ హత్య


(మొదటి పేజి తరువాయి) సహాయకుడిగా పనిచేస్తున్నాడు. అతడికి మొదటి భార్యతో సంతానం కలగకపోవడంతో తన కంటే 20 ఏళ్లు చిన్నదైన నవీన అనే అమ్మాయిని పెళ్లిచేసుకున్నాడు. ఆమెకు తొలుత పాప పుట్టింది. ఆ తర్వాత భార్యలిద్దరి మధ్య గొడవలు జరిగాయి. తన రెండో భార్య మరోసారి గర్భం దాల్చింది. ప్రసవం కోసం ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. రెండోసారి ఆడపిల్లే పుట్టింది. భార్యలిద్దరి మధ్య గొడవలతో విసిగిపోయిన భిక్షం ప్రవసమైన రోజే నవీనకు మత్తు ఇంజక్షన్ ఇచ్చి చంపేశాడు. ఏమీ తెలియనట్టు ఆసుపత్రి సిబ్బంది నిర్లక్ష్యంతోనే చనిపోయిందని నమ్మించి బంధువులతో కలిసి ఆందోళనకు దిగాడు. ఆర్థికసాయం చేస్తామని ఆసుపత్రి యాజమాన్యం హామీ ఇచ్చింది. అందుకు అంగీకరించిన నిందితుడు తన ఊరికి తీసుకెళ్లకుండా ఖమ్మంలోనే నవీన అంత్యక్రియలు నిర్వహించాడు. అనుమానం వచ్చిన ఆసుపత్రి సిబ్బంది సీసీకెమెరా దృశ్యాలు పరిశీలించారు. దీంతో అసలు నిజం వెలుగులోకి వచ్చింది. ప్రసవం జరిగిన రోజు అర్ధరాత్రి 2గంటల సమయంలో భిక్షం తన భార్య నవీనకు ఇంజక్షన్ ఇచ్చాడు. ఆమె చనిపోయిందని నిర్ధారించుకున్న తర్వాత వెళ్లిపోయాడు. ఈ ఘటనపై ఆస్పత్రి యాజమాన్యం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు ప్రశ్నించగా నిందితుడు నిజం ఒప్పుకున్నాడు. మత్తు ఇంక్షన్‌తో భార్య ప్రాణం తీసిన నిందితుడిని కటకటాల్లోకి పంపించారు. ఖమ్మంలో ఇటీవల సూదిమందు ఇచ్చి జమాల్‌సాహెబ్ అనే వ్యక్తిని చంపేసిన ఘటనతో ఈ కేసు వెలుగులోకి వచ్చింది.

## జాతీయ రహదారుల వెంట మొక్కలు నాటాలి



(మొదటి పేజి తరువాయి) వందశాతం బయో ఇథనాల్‌తో వాహనాలు నడిపేలా చర్యలు తీసుకున్నప్పుడే కాలుష్యాన్ని పారదోలవచ్చునన్నారు. భవిష్యత్ అంతా హైడ్రోజన్‌తో నడిచే వాహనాలదే అని చెప్పారు.కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ గురువారం రాజమండ్రిలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ఐదు ఫ్లై ఓవర్లకు శంకుస్థాపన చేశారు. ఈ ఐదింటినీ 216 నేషనల్ హైవేపై నిర్మిస్తుండటం విశేషం. రాజమండ్రిలోని ఆర్ట్స్ కాలేజీ వద్ద ఏర్పాటుచేసిన బహిరంగసభ వేదికపై నుంచి ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన బహిరంగసభలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ మాట్లాడుతూ.. గతంలో వచ్చినప్పుడు ఇచ్చిన హామీని నెరవేరుస్తున్నందుకు చాలా సంతోషంగా ఉన్నదన్నారు. కాలుష్యం విపరీతంగా పెరిగిపోతుండటం వల్ల విచారం వ్యక్తం చేశారు. అంతకుముందు రాజమండ్రి విమానాశ్రయంలో రాష్ట్ర మంత్రులు, పలువురు ఎంపీలు, రాష్ట్ర అధికారులు, బీజేపీ నేతలు కేంద్ర మంత్రికి సాదర స్వాగతం పలికారు. జాతీయ రహదారి నంబర్ 216 పై మోరంపూడి, జొన్నాడ జంక్షన్, ఉండ్రాజవరం జంక్షన్, తేతాలి, కైకవరం వద్ద నాలుగు లేన్ల ÷÷-లఓల్ల÷వర్లను నిర్మిస్తున్నారు. ఇందుకు దాదాపు రూ.3 వేల కోట్ల నిధులు కేటాయించారు. అలాగే, వాకలపూడి-ఉప్పాడ-అన్నవరం జాతీయ రహదారిపై లేనింగ్, సామర్లకోట-అచ్చంపేట జంక్షన్ హైవేపై 4 లేనింగ్, రంపచోడవరం నుంచి కొయ్యూరి వరకు జాతీయ రహదారిపై 2 లేన్ల నిర్మాణం పనులకు కూడా నితిన్ గడ్కరీ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ రవాణాశాఖ మంత్రి రామలింగేశ్వరరావు, ఎంపీలు భరత్‌రామ్, పిల్లి సుభాష్‌చంద్రబోస్, స్థానిక ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, బీజేపీ ఏపీ చీఫ్ సోము వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

## విద్యకు మించిన సంపద మరోటి లేదు



(మొదటి పేజి తరువాయి) సందర్భంగా మాట్లాడుతూ.. ఊహించని విధంగా ఎన్నో విద్యాసంస్థలను ప్రారంభించు కున్నామని చెప్పారు. ఇచ్చిన మాట ప్రకారం ఇంజినీరింగ్ కాలేజీని ఏర్పాటు చేశామని వెల్లడించారు. సిరిసిల్ల జిల్లాకు మెడికల్ కాలేజీ ఇచ్చిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని వెల్లడించారు. ప్రతి జిల్లాలో మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. గిఫ్ట్ ఏ స్మైల్ కింద సిరిసిల్లకు ఆరు అంబులెన్సులు ఇచ్చామని, రాష్ట్ర వ్యాప్తంగా 120 అంబులెన్సులు సమకూరాయని చెప్పారు. దివ్యాంగుల కోసం 1200 త్రి మోటార్ సైకిళ్లు అందించామని తెలిపారు.

## జింఖానా మైదానం వద్ద తీవ్ర ఉద్రిక్తత



(మొదటి పేజి తరువాయి) ఉప్పల్ వేదికగా జరిగే భారత్ – ఆస్ట్రేలియా మ్యాచ్ టికెట్ల కోసం జింఖానా గ్రౌండ్స్ వద్ద ఫ్యాన్స్ ఎగబడటంతో జరిగిన తొక్కిసలాటలో ఓ మహిళ పరిస్థితి సీరియస్‌గా ఉందని సమాచారం. గురువారం ఉదయం టికెట్ల కోసం పెద్ద సంఖ్యలో అభిమానులు జింఖానా గ్రౌండ్స్‌కు చేరుకున్నారు. మూడువేల టికెట్ల కోసం 30వేల మందికి పైగా అభిమానులు తరలివచ్చారు. మహిళలు కూడా టికెట్స్ కోసం క్యూలైన్లలో నిలబడ్డారు. అయితే అంచనాలకు మించి అభిమానులు తరలిరావడంతో పాటు.. టికెట్ల కోసం ఎగబడటంతో అక్కడ తొక్కిసలాట చోటు చేసుకుంది. గేటు వద్ద జరిగిన తొక్కిసలాటలో ఓ మహిళ స్పృహకోల్పోయింది. వెంటనే ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది. అలాగే తొక్కిలసలాటలో పలువురు అభిమానులు గాయపడగా... పోలీసులు కూడా స్వల్పంగా గాయపడ్డారు. ఈ క్రమంలో పరిస్థితిని అదుపు చేసేందుకు ప్రజలపై పోలీసులు లాఠీచార్జ్ చేశారు. దీంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. సికింద్రాబాద్ జింఖానా మైదానం వద్ద మెయిన్‌గేట్ ద్వారా ఒక్కసారిగా అభిమానులు తోసుకురావడంతో పరిస్థితి అదుపు తప్పింది. దీంతో పోలీసులు లాఠీఛార్జ్ చేశారు. ఈ తోపులాటలో పలువురు అభిమానులు, పోలీసులు స్పృహ తప్పి పడిపోయారు. గాయపడిన వారిని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఈ నెల 25న జరగనున్న భారత్-ఆస్ట్రేలియా మ్యాచ్ కోసం జింఖానా మైదానంలో టికెట్లు విక్రయిస్తున్నారు. టికెట్ల కోసం క్రికెట్ అభిమానులు వేలాదిగా మైదానానికి తరలివచ్చారు.ఎన్నడూ లేనంత గా మ్యాచ్ టికెట్లకు ఈసారి భారీ డిమాండ్ నెలకొంది. ఉదయం పది గంటలకు జింఖానా మైదానంలో టికెట్ల విక్రయాన్ని అధికారులు ప్రారంభించారు. అయితే తెల్లవారు జామున నాలుగు గంటల నుంచే ప్రజలు కయూ కట్టారు. ఈ క్రమంలోనే సాంకేతిక సమస్యతో ఆన్‌లైన్ పేమెంట్లకు అంతరాయం ఏర్పడింది. నగదు చెల్లింపుల ద్వారా టికెట్లు విక్రయిస్తున్నారు. దీంతో ఆన్‌లైన్ పేమెంట్లు అంగీకరించడం లేదంటూ అభిమానులు ఆందోళనకు దిగారు. అంచనాలకు మించి వచ్చిన అభిమానులను అదుపు చేయలేక పోలీసుల అవస్థలు పడ్డారు. ఈ ఘటనలో పలువురు అభిమానులు, పోలీసులకు గాయాలయ్యాయి. ఈరోజు తెల్లవారుజాము నుంచే అభిమానులు టికెట్ల కోసం జింఖానా గ్రౌండ్ వద్ద క్యూ కట్టారు. టికెట్ల కోసం పెద్దఎత్తున క్రికెట్ అభిమానులు అక్కడికి తరలివచ్చారు. దీంతో అభిమానులను పోలీసులు నియంత్రించ లేని పరిస్థితి ఏర్పడగా తొక్కిసలాట జరిగింది. తొక్కిసలాటలో పలువురు అభిమానులు స్పృహ తప్పి పడిపోయారు. అలాగే పలువురు పోలీసులకు స్వల్ప గాయాలయ్యాయి. పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చేందుకు అభిమానులపై పోలీసులు లాఠీచార్జ్ చేశారు. జింఖానా గ్రౌండ్స్ వద్ద ఉద్రిక్తత నెలకొనడంతో హెచ్‌సీఏ టికెట్ కౌంటర్లను మూసివేసింది. మ్యాచ్ టికెట్లను ఆన్‌లైన్‌లో మూడు వేలు మాత్రమే ఇస్తారని ప్రచారం జరిగింది. దీంతో టికెట్ల కోసం పెద్ద సంఖ్యలో క్రికెట్ అభిమానులు జింఖానా గ్రౌండ్స్‌కు తరలివచ్చారు. దాదాపు 30వేల మందికిపైగా అభిమానులు అక్కడకు చేరుకున్నట్లు తెలుస్తోంది. అంచనాలకు మించిన క్రికెట్ అభిమానులు తరలిరావడంతో... తొక్కిసలాట జరుగగా... చివరకు పోలీసులు వారిని అదుపుచేసేందుకు లాఠీలకు పనిచెప్పాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆదివారం ఉప్పల్ స్టేడియంలో టీ ట్వంటీ మ్యాచ్ కోసం నిర్వాహకులు ఇప్పటికే టికెట్లు అమ్మేశారు. మొత్తం స్టేడియం సిటింగ్ కెపాసిటీ 60000 కావడంతో 2 వారాల క్రితమే మొత్తం టికెట్లను నిర్వాహకులు అమ్మేశారు. టికెట్ల అమ్మకాలపై భారీగా అవకతవకలు జరిగాయని క్రికెట్ అభిమానులు ఆందోళన వ్యక్తం చేయడంతో జింఖానా గ్రౌండ్లో మరోసారి టికెట్ అమ్మకాలను నిర్వాహకులు నిర్వహించారు. నిజానికి టికెట్స్ ఎప్పుడో అయిపోయాయన్న విషయం తెలియక అక్కడికి వేలాది మంది క్రికెట్ అభిమానులు చేరుకున్నారు. అసలు ఎన్ని టికెట్లు అందుబాటులో ఉన్నాయన్న విషయం సైతం నిర్వాహకులు బయటకు చెప్పడం లేదు. హైదరాబాద్, రాచకొండ పోలీసులకు మ్యాచ్ తలనొప్పిగా మారింది.

## ఉద్యోగం పేరుతో కానిస్టేబుల్ మోసం

**కలెక్టరేట్ ఎదుట దంపతుల నిరసన**

**ఖమ్మం, సెప్టెంబర్ 22 (సమ సమాజం):** ఖమ్మం కలెక్టరేట్ ఎదుట యాదగిరి, మౌనిక అనే భార్యాభర్తలు నిరసన వ్యక్తం చేశారు. తన భార్యకు ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని తాళ్లూరి రామారావు అనే సివిల్ కానిస్టేబుల్ మోసం చేశాడని యాదగిరి వాపోయారు. రైల్వేలో టీసీ ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి తమ దగ్గర్నుంచి కానిస్టేబుల్ రామారావు రూ.15 లక్షలు తీసుకున్నాడని ఆరోపించారు. ఆ కానిస్టేబుల్ పై సీపీ ఆఫీస్ లో కంప్లైంట్ ఇచ్చి సుమారు 3 నెలలవుతున్నా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అతనిపై చట్టపరమైన చర్యలు తీసుకొని తమ డబ్బులు తమకు ఇప్పించగలని కలెక్టర్ ను కోరుతున్నట్లు ఆ దంపతులు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆ ఇద్దరూ కలిసి కలెక్టరేట్ ఎదుట తమకు జరిగిన మోసాన్ని తెలియజేస్తూ.. బ్యానర్ లో వివరాలు తెలియజేస్తూ నిరసన వ్యక్తం చేశారు.

## మంత్రి శ్రీనివాస్‌గౌడ్ రైఫిల్ కాల్పులు చట్టవిరుద్ధమే

ఆంటీఐ ద్వారా వివరాలు సేకరించిన వ్యక్తి



**హైదరాబాద్, సెప్టెంబర్ 22 (సమ సమాజం):** ఒక రైఫిల్ ఉపయోగించాలంటే నేషనల్ రైఫిల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియాకు సంబంధించిన సభ్యత్వం ఉండాలి. అది లేకుండా రైఫిల్‌ను వినియోగించడానికి వీలే లేదు. అయితే ఒకవేళ లైసెన్స్ కలిగి ఉన్నా కూడా ఒక పోలీస్ రైఫిల్‌ను వినియోగించి పబ్లిక్‌లో ఫైర్ ఓపెన్ చేయడం చట్టరీత్యా నేరం. ఇటీవల ఒక్కసారి కాదు.. రెండు సార్లు ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ బహిరంగ ప్రదేశంలో పోలీస్ ఆయుధాన్ని ఉపయోగించి అడ్డంగా దొరికిపోయారు. ఈ విషయమై ఓ వ్యక్తి సమాచారం హక్కు చట్టంని ఆశ్రయించాడు. దీనిపై స్పందించిన ఎన్ఆర్ఏఐ తాజాగా దీనికి సంబంధించిన వివరాలను వెల్లడించింది. శ్రీనివాస్‌గౌడ్‌కు నేషనల్ రైఫిల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సభ్యత్వం ఉందని ఆ ఆర్టీఐ దరఖాస్తుకి బదులిచ్చింది. అయితే సభ్యత్వం ఉన్నా కూడా పోలీసు ఆయుధాన్ని ఉపయోగించి బహిరంగంగా కాల్పులు జరపడానికి మంత్రి శ్రీనివాస్ గౌడ్‌కి అధికారం లేదని ఇది చట్టవిరుద్ధమని పేర్కొంది. స్వాతంత్ర్య వజ్రోత్సవాలను పురస్కరించుకుని నిర్వహించిన ఫ్రీడమ్ రన్‌లో శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు. ఆ వజోత్సవ వేడుకల్లో భాగంగా శుక్రవారం మహబూబ్ నగర్‌లోని జిల్లా పరిషత్ మైదానం నుంచి విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి వచ్చిన మంత్రి శ్రీనివాస్ గౌడ్ పోలీసు తుపాకీతో గాల్లోకి కాల్పులు జరిపి ఫ్రీడమ్ రన్‌ని ప్రారంభించారు. మంత్రి పక్కనే కలెక్టర్, ఎస్పీ, జిల్లా అధికారులున్నారు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవడం, టీవీల్లో ప్రసారమైంది. మంత్రి తుపాకీ పేల్చిన వీడియోలు నిమిషాల వ్యవధిలోనే మీడియాలో వైరల్ అయ్యాయి. పోలీసు తుపాకీతో మంత్రి ఎలా కాల్పులు జరుపుతారంటూ సోషల్ మీడియాలో విమర్శలు వెల్లువెత్తాయి. కాగా, ఈ ఘటనపై సమగ్ర వివరాలతో నివేదిక అందజేయాలని జిల్లా ఎస్పీని డీజీపీ కార్యాలయం ఆదేశించింది.

## మునుగోడు కోసమే గిరిజన బంధు

(మొదటి పేజీ తరువాయి) నిరుద్యోగులను మోసం చేయడానికే గిరిజనులకు 10? రిజర్వేషన్ అన్న ఆయన... గిరిజనులు, ఆదివాసుల మీద గౌరవం ఉంటే ఒక గిరిజన మహిళ రాష్ట్రపతిగా ఎన్నుకుంటుంటే అగ్రవర్ణ నాయకుడు యశ్వంత్ సిన్హాను ఎందుకు ఆహ్వానించారని ప్రవీణ్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. టీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనం పేరుతో యువకులను తాగుబోతులుగా మారుస్తుందని ఆరోపించారు. ఈ నేపథ్యంలోనే తెలంగాణలో బహుజన రాజ్యం తీసుకురావాలని డిమాండ్ చేశారు. 8సం.రాల నుండి టీఆర్ఎస్ చేస్తున్న దోపిడీ పాలన గురించి ప్రజలకు వివరిస్తామని స్పష్టం చేశారు.

## క్రీడాభిమానులపై లాఠీఛార్జి దారుణం

టిక్కెట్ల అమ్మకంలో అవకతవకలకు హెచ్‌సీఏదే బాధ్యత

తక్షణమే చర్యలు తీసుకోవాలన్న బిజెపినేత దాసోజు శ్రవణ్



**హైదరాబాద్, సెప్టెంబర్ 22 (సమ సమాజం):** సికింద్రాబాద్ జింఖానా గ్రౌండ్స్‌లో క్రీడాభిమానులపై జరిపిన లాఠీచార్జ్ దారుణమని బీజేపీ నేత దాసోజు శ్రవణ్ అన్నారు. ఇది పూర్తిగా హెచ్ సీఏ, ప్రభుత్వ వైఫల్యమేనని ఆరోపించారు. టికెట్లు బ్లాక్‌లో అమ్మడంతో పాటు ఇంకా అనేక అక్రమాలు జరిగాయన్న ఆయన... హెచ్‌సిఏ యాజమాన్యంపై, అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా దాదాపు ఐదు రోజులుగా ఫ్యాన్స్ టికెట్స్ కోసం జింఖానా, ఉప్పల్ స్టేడియం చుట్టూ తిరుగుతున్నారు. మొదట్లో ఆన్‌లైన్‌లో అమ్మినా.. ఆ తర్వాత బుక్ చేసుకున్నవాళ్లకు కూడా డబ్బులు వెనక్కి వచ్చాయి. అటు ఆన్ లైన్ లో, ఇటు ఆఫ్ లైన్ లో టికెట్స్ దొరక్కపోవడంతో ఫ్యాన్స్ లో అసహనం పెరిగిపోయింది. నిన్న వేలాదిగా గ్రౌండ్ కు చేరుకోవడం, హెచ్‌సిఏపై వత్తిడి పెరగడంతో.. ఇవాళ టికెట్స్ ఇస్తామంటూ ప్రకటించింది. వేలాదిమంది వస్తారు అని తెలిసినా ఒక్కటే కౌంటర్ పెట్టారు. ఇది కూడా టికెట్స్ పక్రియ చాలా ఆలస్యంగా జరగడం, రాత్రి నుంచి లైన్లో ఉన్న ఫ్యాన్స్‌కు కోపాన్ని తెప్పించింది. దీంతో అంతా ఒక్కసారిగా లోపలికి దూసుకెళ్లే ప్రయత్నం చేయడంతో పోలీసులు లాఠీ ఛార్జ్ చేశారు. ఉదయం నుంచే టికెట్స్ అమ్ముతున్నప్పటికీ.. బాగా ఆలస్యం జరుగుతుండటంతో అభిమానలు ఆగ్రహంతో ఊగిపోయారు. టికెట్స్ దొరుకుతాయో లేదోననే టెన్షన్.. కౌంటర్ బంద్ చేస్తారంటూ జరిగిన ప్రచారం, కేవలం 800, 1200 రూపాయల టికెట్స్ మాత్రమే అమ్మడంతో..అభిమానుల్లో ఆందోళన పెరిగింది. దీంతో అంతా ఒక్కసారిగా కౌంటర్ వైపు దూసుకెళ్లే ప్రయత్నం చేయడంతో పరిస్థితి లాఠీ ఛార్జ్ దాకా వెళ్లింది. జింఖానా గ్రౌండ్ లో జరిగిన తొక్కిసలాటలో గాయపడిన ఓ మహిళ పరిస్థితి విషమంగా ఉంది. ఈ తొక్కిసలాటలో మరో 20మంది గాయపడ్డారు. పోలీసులకు, క్రికెట్ ఫ్యాన్స్ కు మధ్య తోపులాటలో చాలా మంది మహిళలు స్పృహ తప్పి పడిపోయారు. గాయపడిన వారిని యశోద హాస్పిటల్ కు తరలించారు. ప్రస్తుతం అందరి ఆరోగ్యం నిలకడగా ఉంది. తొక్కిసలాటలో ఓ మహిళ చనిపోయినట్లు వస్తోన్న వార్తలపై అడిషనల్ కమిషనర్ చౌహాన్ స్పందించారు. మహిళ చనిపోలేదని, యశోదలో చికిత్స పొందుతోందని తెలిపారు.

## మహిళ బతికుండగానే భూ మార్పిడి

రాయికోడ్ ఎమ్ఆర్వోపై వేటేసిన కలెక్టర్

**సంగారెడ్డి, సెప్టెంబర్ 22 (సమ సమాజం):** సంగారెడ్డి జిల్లాలో మహిళ బతికుండగానే చనిపోయిందని.. ఆమె భూమిని బంధువుల పేరు మీదకు మార్చిన రాయికోడ్ తహసీల్దార్‌పై వేటుపడింది. ఈ మేరకు ఎమ్మార్వో రాజయ్యను కలెక్టర్ శరత్ సస్పెండ్ చేశారు. గతంలో రాయికోడ్‌లో పని చేసి మెదక్ జిల్లాకు వెళ్లిన రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌పై క్రమశిక్షణా చర్యలకు కలెక్టర్ సిఫారసు చేశారు. వృద్ధురాలు బతికుండగానే ఆమె పేరున ఉన్న భూమిని అక్రమంగా కాజేయాలని వారికి కట్టబెట్టిన ఘటన సంగారెడ్డి జిల్లాలో వెలుగులోకి వచ్చింది. ప్రాథమిక విచారణ అనంతరం తహసీల్దార్‌పై కలెక్టర్ వేటు వేశారు. రాయికోడ్ మండలం నాగన్ పల్లికి చెందిన పట్లోళ్ల హన్మంత్ రెడ్డికి సర్వే నంబర్ 198లో 27ఎకరాల 34 గుంటల భూమి ఉంది. గతేడాది ఆయన చనిపోగా ఈ భూమిని భార్య శివమ్మ పేరిట ఫౌతీ చేయించుకున్నారు. భర్త మరణించటంతో ఆమె హైదరాబాద్‌లోని కుమారుల వద్ద ఉంటుండగా శివమ్మ బంధువులు ఆమె భూమిపై కన్నేశారు. శివమ్మ మరణించిందంటూ ఆ భూమిని తన పేరిట మార్చాలంటూ హన్మంత్ రెడ్డి సోదరి స్లాట్ బుక్ చేసుకుంది. శివమ్మ పేరున ఉన్న భూమి మార్చుకునేందుకు హన్మంత్ రెడ్డి మరణ ధ్రువీకరణ పత్రాన్ని అధికారులకు సమర్పించింది. భర్త మరణ ధ్రువీకరణ పత్రం తీసుకుని బతికున్న భార్య పేరున ఉన్న భూమినంతా తహసీల్దార్ రాజయ్య రెవెన్యూ అధికారులు ఈ నెల10న అంజమ్మ పేరున మార్చేశారు. విషయం తెలుసుకన్న బాధితురాలు సంగారెడ్డి కలెక్టర్‌ను ఆశ్రయించి ఆధారాలు సమర్పించింది. అనంతరం అక్రమంగా భూమి రిజిస్ట్రేషన్ చేసిన తహసీల్దార్ రాజయ్యతో పాటు అంజమ్మపై బాధితురాలు శివమ్మ రాయికోడ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు తహసీల్దార్ రాజయ్యపై రాయికోడ్ పోలీసులు క్రిమినల్ కేసు నమోదు చేశారు. భూమి మరొకరి పేరున పట్టాచేశారంటూ ముందుగా బాధితురాలు సంగారెడ్డి కలెక్టర్ శరత్‌ను ఆశ్రయించగా ఇప్పటికే ఆయన విచారణ జరిపారు. ప్రాథమిక విచారణలో తహసీల్దార్ నిర్వాకం బయటపడటంతో రాజయ్యను వెంటనే సస్పెండ్ చేశారు.



## ఆరోగ్య తెలంగాణగా ఆవిర్భావం

(మొదటి పేజీ తరువాయి) నీతి ఆయోగ్ వెల్లడించిన నివేదిక ప్రకారం ఆరోగ్య సూచికల్లో దేశంలో కేరళ, తమిళనాడు తర్వాత తెలంగాణ రాష్ట్రం 3వ స్థానంలో నిలిచింది. కేసీఆర్ కిట్ ద్వారా 2017 నుంచి ఇప్పటివరకు 13,29,951 మంది లబ్ధిపొందారు. రూ.1,176 కోట్లు డీబీటీ ద్వారా లబ్ధిదారుల ఖాతాలకు ప్రభుత్వం బదిలీ చేసింది. 102 రిఫరల్ ట్రాన్స్‌పోర్ట్ ద్వారా 41 లక్షల మంది గర్భిణులు రవాణా సదుపాయం పొందారు. ప్రతి బిడ్డ ఆరోగ్యంగా పుట్టి, ఎదిగేందుకు ప్రభుత్వం గట్టి ప్రయత్నాలు చేస్తోంది. యూనివర్సల్ ఇమ్యునైజేషన్ ప్రోగ్రామ్ కింద రాష్ట్రంలో 99శాతం లక్ష్యాన్ని సాధించింది. 35 ప్రత్యేక నవజాత సంరక్షణ యూనిట్లు ప్రస్తుతం పనిచేస్తున్నాయి. లేబర్ రూమ్‌ల సమీపంలో ఏర్పాటు చేసిన ఈ యూనిట్ల ద్వారా అనారోగ్యంతో ఉన్న నవజాత శిశువులకు సరయిన ప్రత్యేక సంరక్షణ సేవలు సకాలంలో అందుబాటులోకి వచ్చాయి. పట్టణ పేదలకు నాణ్యమైన ఆరోగ్య సేవలను అందించడానికి జీహెచ్ఎంసీ ప్రాంతంలో 259 బస్తీ దవాఖానాలు పని చేస్తున్నాయి. బస్తీ దవాఖానాల్లో 195 రకాల మందులు, 57 రకాల ల్యాబ్ పరీక్షలు అందుబాటులో ఉన్నాయి.ఉచిత డయాగ్నోస్టిక్ కేంద్రాలు ద్వారా హబ్ అండ్ స్పోక్ మోడల్ కింద రక్త పరీక్షలు, ఈసీజీ అండ్ ఎక్స్-రే, యూఎస్‌జీ డయాగ్నస్టిక్ సేవలను ప్రభుత్వం అందిస్తున్నది. ప్రస్తుతం 20 జిల్లాల్లో ఈ టెస్ట్ లాబ్స్ ఉన్నాయి. మరో 13 ల్యాబ్‌లను ఏర్పాటు చేస్తున్నది. ప్రతి నెలా దాదాపు 4 లక్షల శాంపిల్స్‌ను ఈ టెస్ట్ లాబ్స్ లో పరీక్షిస్తున్నారు. ప్రస్తుతం హబ్‌లు పాథాలజీ, రేడియాలజీ, వైరాలజీ సేవలను కూడా అందిస్తున్నాయి. వీటితో పాటు సెకండరీ హెల్త్ కేర్ సర్వీసెస్‌ను ప్రభుత్వం విస్తృత పరిచింది. సెకండరీ కేర్‌లో 10,170 పడకలతో 175 ఆసుపత్రులు సెకండరీ హెల్త్ కేర్ సేవలను అందిస్తున్నది. తృతీయ ఆరోగ్య సంరక్షణ సేవలు, వైద్యవిద్యను ప్రజలకు చేరువచేసింది. రాష్ట్రంలో ప్రతి జిల్లాకు ప్రభుత్వ వైద్య కళాశాల ఉండేల జిల్లాలకు వైద్య కళాశాలను ప్రభుత్వం మంజూరు చేసింది. వైద్య కళాశాలలకు అనుబంధంగా ఉన్న ప్రభుత్వ జిల్లా ఆసుపత్రుల్లో అదనపు వసతులను ప్రభుత్వం కల్పిస్తున్నది. 18 మే 2021న ఏబీ-పీఎంజేఏవై స్కీమ్‌తో ఆరోగ్యశ్రీని ప్రభుత్వం అనుసంధానించింది. తద్వారా 87.5 లక్షల కుటుంబాలకు లబ్ధి చేకూరుతుంది. ఆరోగ్యశ్రీ కింద రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి 25 లక్షలకుపైగా శస్త్రచికిత్సలు జరిగాయి. తద్వారా 13 లక్షలకుపైగా పేషెంట్స్ లబ్ధిపొందారు. రాష్ట్రంలో 57 ప్రభుత్వ రక్తనిధి కేంద్రాలు, 17 రక్త నిల్వ కేంద్రాలు ఉచితంగా సేవలు అందిస్తున్నాయి. 27 బ్లడ్ బ్యాంకుల్లో కాంపోనెంట్ సెపరేటర్లు ఉన్నాయి. ప్రభుత్వ వైద్య ఆరోగ్య సేవలను మెరుగుపరిచేందుకు కొత్త 'ఇంటిగ్రేటెడ్ హాస్పిటల్ ఫెసిలిటీ మేనేజ్‌మెంట్ సర్వీసెస్ ను ప్రవేశపెట్టింది. విధానంలో భాగంగా డైట్ ఛార్జీలను రెట్టింపు చేసి కొత్త డైట్ మెనూను తీసుకువచ్చింది. కొత్త ఔషధ విధానాన్ని ప్రభుత్వం ప్రవేశపెడుతున్నది. రూ.61కోట్ల అంచనా వ్యయంతో 29 బోధనాసుపత్రులు, 20 జిల్లా ఆసుపత్రులు, 30 ఆసుపత్రులు/సీహెచ్‌సీల్లో ఎలక్ట్రికల్ సేఫ్టీ పనులు మంజూరు చేయగా.. పనులు పురోగతిలో ఉన్నాయి. రూ.61 కోట్లతో 20 ఆసుపత్రుల్లో మురుగునీటి శుద్ధి ఎలాంట్లు ) మంజూరు అయ్యాయి. రూ.31 కోట్ల అంచనా వ్యయంతో 153 ఇతర ఆసుపత్రుల్లో ఫైర్ సేఫ్టీ పనులు మంజూరయ్యాయి. 61 ఆసుపత్రుల్లో మార్చురీల మరమ్మత్తు, పునరుద్ధరణ అండ్ అప్‌గ్రేడేషన్ పనులను ప్రభుత్వం మంజూరు చేసింది. డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా 12,755 ఖాళీలను భర్తీ చేయడానికి మెడికల్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్, తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీసెస్ కమిషన్‌కు ప్రభుత్వం ఇటీవల అనుమతి ఇచ్చిందని ఆరోగ్యశాఖ వివరించింది.

## కాంగ్రెస్ పార్టీలో ఎన్నికల హడావిడి

(మొదటి పేజీ తరువాయి) రాజుకుంది. రాజస్థాన్ సీఎం అశోక్ గహ్లోత్ పోటీచేయడం దాదాపు ఖాయమైపోయింది. ఆయనపై కేంద్ర మాజీ మంత్రి శశి థరూర్ మాత్రమే కాకుండా మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దిగ్విజయ్‌సింగ్ సైతం పోటీ చేయడానికి ఆసక్తి చూపుతున్నారు. గెహ్లోట్ బుధవారమిక్కడ 10-జన్‌పథ్‌లో తాత్కాలిక అధ్యక్షురాలు సోనియాతో సమావేశమయ్యారు. రాజస్థాన్ రాజకీయాలు.. తన తర్వాత అక్కడ ఎవరు సీఎం అవుతారు.. కొన్నాళ్లపాటు తాను జోడు పదవుల్లో కొనసాగడం తదితరాలపై చర్చించినట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఆయనకు అధ్యక్ష ఎన్నికపై పూర్తి స్పష్టత వచ్చింది. సీఎం పీఠంపై తన ప్రత్యర్థి సచిన్ పైలట్‌ను కూర్చోబెట్టడానికి వీల్లేదని, తన అదుపాజ్ఞల్లో ఉండే నేతనెవరినైనా ఎంపిక చేయాలని సోనియాను ఆయన కోరుతున్నట్లు తెలిసింది. కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో మంగళవారం రాత్రి జైపూర్‌లో ఆయన సమావేశమవడం గమనార్హం. ఢిల్లీలో ఉన్న పైలట్ ఈ భేటీకి రాలేదు. సోనియాతో భేటీకి ముందు బుధవారం గెహ్లాట్ మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్‌లో అధ్యక్ష ఎన్నికల వేడిపార్టీ పగ్గాలు మళ్లీ చేపట్టాల్సిందిగా అగ్రనేత రాహుల్‌గాంధీని ఒప్పించేందుకు చిట్టచివరి ప్రయత్నం చేస్తానని తెలిపారు. పార్టీ కార్యకర్తలు కోరితే నామినేషన్ వేస్తానన్నారు. కాంగ్రెస్ తనకు అన్నీ ఇచ్చిందని, 40-50 ఏళ్లుగా తాను పదవుల్లో ఉన్నానని వ్యాఖ్యానించారు. శశి థరూర్ పోటీ గురించి ప్రస్తావించగా.. పోటీ జరగాల్సిందేనని.. అంతర్గత ప్రజాస్వామ్యానికి అది మంచిదని బదులిచ్చారు. గురువారం ఆయన కేరళలోని కోచీ చేరుకుని 'భారత్ జోడో యాత్ర'లో ఉన్న రాహుల్‌తో భేటీ అయ్యేందుకు వెళ్లారు. తాను తటస్థంగా ఉంటానని.. ఎవరి పక్షానా నిలవనని గెహ్లోట్‌కు సోనియా చెప్పినట్లు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ తెలిపారు. మరోవైపు.. కాంగ్రెస్‌లో జోడు పదవులు కుదరవని.. గహ్లోత్ సీఎం పదవికి రాజీనామా చేయాలని రాహుల్‌కు అత్యంత సన్నిహితుడైన సీనియర్ నేత దిగ్విజయ్‌సింగ్ స్పష్టం చేశారు. అధ్యక్ష ఎన్నికల రేసులో తాను కూడా ఉన్నానని ప్రకటించారు. అయితే జోడో యాత్రలో సచిన్ పైలట్ రాహుల్‌ను బుధవారం కలుసుకున్నారు. బహుశా రాజస్థాన్ గురించే మాట్లాడి ఉంటారని అనుకుంటున్నారు. ఈ క్రమంలో గెహ్లాట్ కూడా రావడం రాజకీయంగా ప్రాధాన్యతను సంతరించుకుంది. ఇంకోవైపు.. రాహుల్ అధ్యక్ష పగ్గాలు చేపట్టాలంటూ పీసీసీలు ఏకగ్రీవ తీర్మానాలు చేస్తూనే ఉన్నాయి. బుధవారం తెలంగాణ, పంజాబ్ పీసీసీలు కూడా రాహుల్ అధ్యక్ష పదవి చేపట్టాలని తీర్మానించాయి. సల్మాన్ ఖుర్షీద్, పి.చిదంబరం వంటి సీనియర్ నేతలు కూడా పార్టీ బలోపేతానికి రాహుల్‌నే అధ్యక్షుడిని చేయాలని.. అందరూ కలిసి ఒప్పించాలని కోరడం గమనార్హం. పిసిసిలు చేసిన తీర్మానాలకు రాహుల్ తలొగ్గితే పార్టీని గాడిలో పెట్టే అవకాశం ఉంటుంది. లేకుంటే ప్రియంకను అయినా ఒప్పించి అధ్యక్షస్థానంపై కూర్చోబెట్టాలి. కాంగ్రెస్ శ్రేణులు కూడా ఇదే కోరుకుంటున్నాయి.

# బతుకమ్మ చీరెలతో నేతన్నలకు పని

పండగ సారెగా చీరల పంపిణీ

ఏటా చీరల కోసం 300 కోట్లు వెచ్చింపు

బతుకమ్మ చీరలను పంపిణీ చేసిన మంత్రి కెటిఆర్

బైజూస్ లోడెడ్ ట్యాబ్‌ల పంపిణీ చేసిన మంత్రి



**రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 22 (సమ సమాజం):** పేదింటి ఆడబిడ్డల ముఖాల్లో చిరునవ్వులు చూసేందుకు, సిరిసిల్లలోని నేత కార్మికులకు పని కల్పించేందుకు బతుకమ్మ పండుగ సారెగా ప్రభుత్వం చీరలు పంపిణీ చేస్తోందని మంత్రి కేటీఆర్ అన్నారు. ఇవాళ సిరిసిల్లలో జరిగిన రాష్ట్రస్థాయి బతుకమ్మ చీరలు పంపిణీ ప్రారంభ కార్యక్రమానికి కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరైయ్యారు. ఈ కార్యక్రమాన్ని సిరిసిల్ల కలెక్టరేట్ వేదికగా ఆయన లాంఛనంగా ప్రారంభించి చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం రూ.300 కోట్లు బతుకమ్మ చీరల కోసం వెచ్చిస్తున్నామన్నారు. చేనేత కార్మికులు 40 శాతం, మరమగ్గం కార్మికులకు 10 శాతం నూలు రాయితీ ఇస్తున్నామ్నారు. టెక్స్ టైల్ పార్క్ లో జుకి మేష జనసమ్మర్ధక శిక్షణ కేంద్రం పెట్టామని తెలిపారు. అపెరల్ పార్క్ లో 8 నుండి 10 వేల మంది మహిళలకు త్వరలోనే ఉపాధి కల్పిస్తున్నామన్నారు. పెద్దూర్ లో 80 ఎకరాల్లో వీవింగ్ పార్క్ ను ఏర్పాటు చేయనున్నామని మంత్రి కేటీఆర్ తెలిపారు. పక్క రాష్ట్రం తమిళనాడు తిర్పూర్ లో ప్రతి సంవత్సరం ప్రపంచ విపణిలో 40 వేల కోట్ల వస్త్ర ఎగుమతులు చేస్తున్నారని.. అదే సిరిసిల్లలో 2 వేల కోట్లు చేస్తున్నామని అన్నారు. న్యూజిలాండ్ లో రాజన్న సిరిపట్టు పేరుతో సిరిసిల్ల చీరలకు బ్రాండింగ్ చేస్తున్నారని చెప్పారు. సీఎం కేసిఆర్ ఆశీస్సులతో నైపుణ్యాలు పెంచుకుంటూ, కొత్త తరహా ఆలోచనలతో తిర్పూర్ కు ధీటుగా సిరిసిల్లను తీర్చిదిద్దుతామని అన్నారు. మహిళల అభిరుచులకు అనుగుణంగా కోటి బతుకమ్మ చీరలు సిద్ధం చేశామని కేటీఆర్ చెప్పారు. రాష్ట్రం మొత్తానికి బతుకమ్మ పండుగ కానుకగా అందించే చీరలు సిరిసిల్ల నుంచే ఉత్పత్తి కావడం మనందరికీ గర్వకారణం అన్నారు. ఇంకా ఎవరైనా పెన్షన్ లు రాకుంటే వారికి కూడా అందిస్తామని కేటీఆర్ హామీ ఇచ్చారు. త్వరలోనే సొంత జాగాలో ఇండ్లను నిర్మించుకునే పేద ప్రజలకు ప్రభుత్వం తరపున రూ.3 లక్షలు అందించే కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. త్వరలో సిరిసిల్లలో అపెరల్ పార్క్‌ను ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి కేటీఆర్ ప్రకటించారు. సిరిసిల్ల పట్టు చీరెలకు ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ ఉందన్నారు. విశ్వాసాలకు అనుగుణంగా పండుగ కానుకలు అందిస్తున్నామన్న కేటీఆర్.. సిరిసిల్లలో బలవన్మరణాల నివారణకు, తెలుగింటి ఆడపడుచులకు బతుకమ్మ కానుకలు ఇవ్వడానికి చీరెల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఏటా చీరెల పంపిణీకి రూ.300కోట్లు బతుకమ్మ చీరెల కోసం వెచ్చిస్తున్నామన్నారు. నేతన్నలకు రూ.5లక్షల బీమా పథకం ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అన్నారు. చేనేత కార్మికులకు 40 శాతం, పవర్లూమ్ కార్మికులకు 10 శాతం నూలు రాయితీ ప్రభుత్వం ఇస్తుందని చెప్పారు. 60 ఎకరాల్లో ఏర్పాటు చేసే పార్క్‌లో బీడీలు చుట్టూ మహిళలకు పనులు కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు. తమిళనాడు తిరుప్పూర్‌కు వెళ్లి అక్కడి వస్త్ర పరిశ్రమను పరిశీలించి రావాలని పవర్‌లూమ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గూడూరి ప్రవీణ్, సెక్రెటరీ బుద్ధ ప్రకాశ్‌కు సూచించారు. చేతనైన స్థాయిలో మంచి బతుకమ్మ చీరెలను ఉత్పత్తి చేస్తున్నామన్న కేటీఆర్.. నేతన్నల అభివృద్ధికి అన్ని రకాల కార్యక్రమాలు చేపడుతామ న్నారు. ఊరు ఊరికి, వాడవాడకి వచ్చి ప్రజా ప్రతినిధులు చీరెలను పంపిణీ చేస్తారని కేటీఆర్ పేర్కొన్నారు. త్వరలో స్థలం ఉన్నవారికి డబుల్ బెడ్రూం ఇల్లు కట్టుకునేందు రూ.3 లక్షలు ఇచ్చే పథకం వెల్లడించారు. ఇదిలా ఉండగా.. సిరిసిల్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గిఫ్ట్ ఏ స్మైల్ కార్యక్రమం జరిగింది. 850 మంది ఇంటర్ విద్యార్థులకు డిజిటల్ ట్యాబ్‌లను కేటీఆర్ పంపిణీ చేశారు. సిరిసిల్లలో 13మండలాల్లో 6వేల మంది విద్యార్థులకు ట్యాబ్‌లను అందజేస్తామని, ఆకాశ్ బైజు సహకారంతో ఉచితంగా సాఫ్ట్‌వేర్ అందించనున్నట్లు చెప్పారు. అలాగే గిఫ్ట్ ఏ స్మైల్ కార్యక్రమంలో భాగంగా తొలివిడుతలో అంబులెన్స్‌లు, రెండో విడుతలో విద్యార్థులకు మూడుచక్రాల వాహనాలను కేటీఆర్ పంపిణీ చేశారు.తాను ఇప్పటివరకు ఎప్పుడూ ఎన్నికల్లో డబ్బు, మద్యం పంచలేదని ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 6 వేల మందికి పైగా విద్యార్థులకు బైజూస్ సాఫ్ట్‌వేర్ లోడింగ్ చేసిన ట్యాబ్‌లు పంపిణీ చేసే కార్యక్రమాన్ని మంత్రి కేటీఆర్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ... సిరిసిల్ల, వేములవాడలో అభివృద్ధికి సాయశక్తులా కృషి చేస్తున్నానన్నారు. అధికారం రాగానే అది శాశ్వతమని కొందరు ఊహించుకుంటారు.. కాని వచ్చిన అవకాశాన్ని ఓ మంచి పనిని చేయడానికి ఉపయోగించాలని తెలిపారు. తన పుట్టిన రోజున అనవసర ఖర్చులకు, ఆర్భాటాలకు పోకుండా నలుగురికి ఉపయోగపడే విధంగా గిఫ్ట్ ఏ స్మైల్ కార్యక్రమం ప్రారంభించానని కేటీఆర్ ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఆన్ లైన్ పాఠాలు మన పేద పిల్లలకు కూడా అందాలని ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమం చేపట్టారమని మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. జిల్లాలోని ఇంటర్ విద్యార్థినీ, విద్యార్థులకు అంటే సుమారు 6000 మందికి ట్యాబ్ లు పంపిణీ చేస్తామన్నారు. ఒక్కో ట్యాబ్ లో సుమారు 60 నుండి 70 వేల రూపాయల విలువ చేసే సాఫ్ట్ వేర్ ను బైజుస్ సంస్థ ఉచితంగా అందిస్తోందని కేటీఆర్ చెప్పారు. కొద్దిగా ఆలోచన పెడితే కొత్త ఆవిష్కరణ లను రూపొందించే సత్తా అందరికి ఉంటుందన్న మంత్రి...- సిరిసిల్లలో తనపై పోటీ చేయాలనుకునే వారు కూడా ఈ విధంగా మంచి పనులు చేయండని సూచనలిచ్చారు. మంచి పనులు చేద్దామని, ప్రజల మనసు గెలుచుకుందామని నాయకులు ప్రజా ప్రతినిధులకు మంత్రి కేటీఆర్ పిలుపునిచ్చారు.

## ఆత్మస్తుతి-పరనింద తగదు ! (ఆధ్యాత్మిక చింతన)

**తిరుమల, సెప్టెంబర్ 22 (సమ సమాజం):** మనిషి స్వభావరీత్యా తనకంటే అధికులు ఎవరూ ఉండకూడ దనుకుంటాడు. అలా ఎవరైనా ఉంటే అసూయతో రగిలిపోతాడు. పైకి నవ్వుతూనే, లోపల దహించుకు పోతుంటాడు. పరోక్షంలో ఆ వ్యక్తి గురించివిపరీత వ్యాఖ్యలు చేస్తూ ఉంటాడు. తన గొప్పతనాన్నిఎవరూ గుర్తించడంలేదనే దుగ్ధ ఉన్నవారు తమ గురించితామే చెప్పుకొంటారు. ఆ ధోరణిలో ఇతరులను తక్కువ చేసిమాట్లాడుతుంటారు.ఒక సందర్భంలో అర్జునుడికి ధర్మరాజు మీద విపరీతమైన 'కోపం వచ్చింది. చంపేద్దామనుకున్నాడు. కారణం, ధర్మరాజు జూద వ్యసనమే అన్ని కష్టాలకూ మూలంగా భావించడం. అంతలోనే నిగ్రహించుకుంటాడు. సాక్షాత్తు ధర్మమూర్తిని హతమార్చాలనుకోవడం మహాపరాధంగా భావించి ఆత్మహత్య చేసుకోవాలనుకున్నాడు. అర్జునుడికి తోడునీడ అయిన శ్రీకృష్ణుడు ఓదారుస్తూ 'బావా! ఈ రెండింటికీ నివారణోపాయం ఉంది. ఒకటి- నీ కసి తీరేదాకా ధర్మరాజును నిందించు. అది హత్యతో సమానం. రెండు గురించి నీవే గొప్పలు చెప్పుకో...అది ఆత్మహత్యలాంటిది' అన్నాడు. సన్నివేశం మహాభారతంలోనిది అయినా, ఈ సూచన అన్ని కాలాలకూ వర్తిస్తుంది. ఆత్మస్తుతి - పరనింద చేసేవాళ్ళు అన్ని కాలాల్లోనూ ఉంటారు. అలా చెయ్యడం ఎంత దోషమో వారికి తెలియదు. హత్య-ఆత్మహత్యలకు సమానమని తెలిశాక పరనిందకు ఆత్మస్తుతికి పాల్పడటానికి ఎవ రైనా సంకోచిస్తారు.




# చలన చిత్రం




## గాడ్‌ఫాదర్‌పై పెరుగుతున్న అంచనాలు

### భారీగా నాన్-థియేట్రికల్ బిజినెస్

మెగాస్టార్ చిరంజీవి రీ ఎంట్రీ తర్వాత ఫుల్ జోష్‌తో సినిమాలు చేస్తున్నాడు. తాజాగా దసరా కానుకగా 'గాడ్‌ఫాదర్'తో ప్రేక్షకుల ముందుకు వస్తున్నాడు. ఇప్పటికే చిత్రం నుండి విడుదలైన ఫస్ట్‌లుక్ పోస్టర్ నుండి ఇటీవలే విడుదలైన టీజర్ వరకు ప్రతీది సినిమాపై అంతకంతకు అంచనాలను పెంచుతూనే ఉన్నాయి. మోహన్‌రాజా దర్శకత్వం వహించిన ఈ చిత్రం షూటింగ్ పూర్తి చేసుకొని పోస్ట్ ప్రొడక్షన్ పనులతో బిజీగా ఉంది. పొలిటికల్ యాక్షన్ థ్రిల్లర్ నేపథ్యంలో తెరకెక్కిన ఈ సినిమా అక్టోబర్ 5న విడుదల కానుంది. ఈ క్రమంలో మేకర్స్ వరుసగా అప్‌డేట్‌లను ప్రకటిస్తూ సినిమాపై క్యూరియాసిటీని పెంచుతున్నారు. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన ఓ వార్త నెట్టింట తెగ వైరల్ అవుతుంది. ఈ చిత్రానికి భారీగా నాన్-థియేట్రికల్ బిజినెస్ జరిగిందని సమాచారం. గాడ్‌ఫాదర్ మూవీ డిజిటల్ హక్కులు రూ.57కోట్లకు అమ్ముడయ్యాయని టాక్. తెలుగు, హిందీ వెర్షన్‌లను కలుపుకుని నెట్‌ఫ్లిక్స్ ఇంత భారీ మొత్తంలో ఓటీటీ రైట్స్‌ను కొనుగోలు చేసిందని అంటున్నారు. అంతేకాకుండా సల్మాన్ ఖాన్ కూడా ఈ చిత్రంలో భాగమవడంతో అన్ని కోట్లకు డీల్ కుదిరించుకుందట. ఇక ఈ చిత్రానికి శాటిలైట్, ఆడియో హక్కుల రూపంలో మరో రూ.60కోట్ల వరకు బిజినెస్ జరిగిందట. దీన్ని బట్టి చూస్తే కేవలం నాన్-థియేట్రికల్ హక్కుల రూపంలోనే ఈ చిత్రానికి రూ.117 కోట్ల వరకు వచ్చాయి. ఈ చిత్రం మలయాళంలో సూపర్ హిట్టయిన లూసీఫర్‌కు రీమేక్‌గా తెరకెక్కింది. కొణిదెల ప్రొడక్షన్స్, సూపర్ గుడ్ ఫిలింస్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించాయి. సల్మాన్‌ఖాన్ అతిథి పాత్రలో నటించగా సత్యదేవ్, నయనతార కీలకపాత్రలు పోషించారు. ఎస్ఎస్ థమన్ సంగీతాన్ని అందించాడు. లేటెస్ట్‌గా విడుదలైన తార్ మార్ తక్కర్ మార్ సాంగ్‌కు ప్రేక్షకుల నుండ విశేష స్పందన వస్తుంది.

## షారూఖ్ తెరపైకి రాక నాలుగేళ్లు

### జవన్ సినిమా కోసం అభిమానుల ఎదురుచూపు




బాలీవుడ్ బాద్‌షా షారుఖ్ ఖాన్ ఫ్యాన్స్ తమ అభిమాన హీరో సినిమా కోసం వేయి కళ్ళతో ఎదురు చూస్తున్నారు. షారుఖ్ సినిమా వచ్చి దాదాపు నాలుగేళ్ళు దాటింది. 2018లో వచ్చిన 'జీరో' తర్వాత ఇప్పటివరకు ఈయన నుండి మరో సినిమా రాలేదు. ఎప్పుడెప్పుడు షారుఖ్‌ను బిగ్‌స్క్రీన్‌పై చూస్తామా అని అభిమానులు ఎంతగానో ఎదురు చూస్తున్నారు. ప్రస్తుతం ఖాన్ మూడు చిత్రాలను సెట్స్‌పైన ఉంచాడు. అందులో 'జవాన్' ఒకటి. తమిళ స్టార్ డైరెక్టర్ అట్లీ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నాడు. ఇప్పటికే చిత్రం నుండి విడుదలైన ప్రచార చిత్రాలు, టీజర్ సినిమాపై విపరీతమైన అంచనాలు క్రియేట్ చేశాయి. ప్రస్తుతం షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రం వచ్చే ఏడాది జూన్ 2నవిడుదల కానుంది. ఇదిలా ఉంటే తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన ఓ వార్త నెట్టింట వైరల్‌గా మారింది. ఈ చిత్రంలో గెస్ట్ రోల్‌లో ఓ తమిళ స్టార్ హీరో నటించనున్నాడని కోలీవుడ్ వర్గాల టాక్. అట్లీ ఈ సినిమాలో అతిథి పాత్ర కోసం సూపర్ స్టార్ రజినీకాంత్‌ను సంప్రదించాడట. పాన్ ఇండియా ప్రాజెక్ట్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో ఇప్పటికే తమిళ స్టార్ విజయ్ సేతుపతి ఈ చిత్రంలో విలన్ పాత్రలో నటిస్తున్నాడు. ఇక ఇప్పుడు సూపర్‌స్టార్ కూడా సినిమాలో కనిపిస్తే తమిళంలో కూడా ఈ చిత్రం భారీ స్థాయిలో కలెక్షన్‌లు సాధిస్తుందని అట్లీ భావిస్తున్నాడట. ఇందులో నిజమెంతుందో తెలియాలంటే మేకర్స్ నుండి అధికారిక ప్రకటన వచ్చే వరకు వేచి చూడాల్సిందే. గతంలో కూడా ఈ చిత్రంలో విజయ్ కీ రోల్‌లో నటిస్తున్నాడని వార్తలు వచ్చాయి. అయితే అది రూమర్‌గానే మిగిలిపోయింది. ఇక ఇప్పుడు ఏకంగా సూపర్ స్టార్ నటించనున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈ చిత్రంలో షారుఖ్ తండ్రి, కొడుకుగా డ్యూయల్ రోల్‌లో నటించనున్నాడు. నయనతార ఇన్వెస్టిగేటీవ్ ఆఫీసర్‌గా నటించనుంది. ప్రస్తుతం షారుఖ్ నటించిన 'పఠాన్' విడుదలకు సిద్ధంగా ఉంది. సిద్దార్థ్ ఆనంద్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో దీపికా పదుకొనే హీరోయిన్‌గా నటించింది. దీనితో పాటు రాజ్ కుమార్ హిరాణి దర్శకత్వంలో 'డుంకి' సినిమాను చేస్తున్నాడు.



## దొంగలున్నారు జాగ్రత్త ఓ డిఫరెంట్ స్టోరీ

మత్తు వదలరా, తెల్లవారితే గురువారం చిత్రాలతో ఆకట్టుకున్న శ్రీ సింహా.. 'దొంగలున్నారు జాగ్రత్త' అంటూ వస్తున్నాడు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రు ఎత్తుకెళ్లడానికి వచ్చిన దొంగ.. డోర్స్ లాక్ అవడంతో కారులోనే ఇరుక్కుపోతాడు. అందులో ఓ టైమ్ బాంబ్ కూడా ఉంటుంది. అతనెలా బయటపడ్డాడనేది స్టోరీ. వెసులుబాటు కోసం కారును ఏ పార్ట్‌కి ఆ పార్ట్ తీసి మళ్లీ అమర్చేలా మాడిఫైడ్ చేశారు. ఒకే జానర్‌కి కట్టుబడకుండా ఏ జానర్‌లో నటించేందుకైనా రెడీగా ఉన్నా. స్టోరీ గ్రిప్పింగ్‌గా, ఎంటర్‌టైనింగ్‌గా ఉంటే పది నిముషాల పాత్రయినా చేస్తా. కథల ఎంపిక విషయంలో నాన్న కీరవాణి, రాజమౌళి బాబాయితో పాటు కుటుంబ సభ్యులందరి సలహాలూ తీసుకుంటా. ఫైనల్ డెసిషన్ మాత్రం నాదే. బాబాయి కనుక రాజమౌళి గారితో చనువుండొచ్చు. కానీ నటుడిగా ఏ స్థాయిలో ఉన్నానో నాకు తెలుసు. ఆయన నాతో సినిమా చేసే స్థాయికి ఎదగాలంటే చాలా టైమ్ పడుతుంది. అదొక డ్రీమ్. ఇప్పడప్పడే దాన్ని ఆశించకూడదు కూడా. ప్రస్తుతానికి 'భాగ్ సాలే' షూటింగ్ పూర్తయింది. పోస్ట్ ప్రొడక్షన్ జరుగుతోంది. ఈ ఇయరే రిలీజ్. 'ఉస్తాద్' ఫస్ట్ షెడ్యూల్ కంప్లీటయ్యిందది.



## త్వరలోనే భారతీయుడు షూట్‌లో పాల్గొంటా

### మాతృత్వాన్ని ఆస్వాదిస్తున్న కాజల్

పెళ్లి తర్వాత సినిమాలకు కాస్త గ్యాప్ ఇచ్చారు కాజల్ అగర్వాల్.. ఏడాది తిరిగే లోపు పండంటి బిడ్డకు జన్మనిచ్చారామె. అప్పటి నుంచి తన బిడ్డతోనే గడుపుతూ మాతృత్వాన్ని ఆస్వాదిస్తున్నారు. ఇప్పుడు విరామానికి బ్రేక్ ఇవ్వనున్నారు కాజల్. తిరిగి షూటింగ్‌లో సందడి చేయడానికి సిద్ధమవుతున్నారు. ప్రస్తుతం కాజల్ ఫిట్‌నెస్‌పై దృష్టిపెట్టారు. జిమ్, వర్క్‌వుట్స్ అంటూ బిజీబిజీగా ఉన్నారు. బుధవారం గుర్రపు స్వారీ చేస్తున్న వీడియో ఇన్‌స్టాలో షేర్ చేశారు కాజల్. అంతే కాదు బాబు పుట్టిన తర్వాత శరీరంలో వచ్చిన మార్పులు గురించి ఓ పోస్ట్ చేశారు. నా బిడ్డ నీల్ కిచ్లు పుట్టి 5 నెలల కావొస్తుంది. ప్రస్తుతం తన ఆలనాపాలనా చూసుకోవడానికే టైమ్ సరిపోవడం లేదు. త్వరగా షూటింగ్ సెట్‌లో అడుగుపెట్టాలనుంది. అందుకోసం ఎంతో ఆతురతగా ఎదురుచూస్తున్నా. త్వరలోనే పనిలో పడబోతున్నా. అయితే ఒకప్పటిలా నాకు ఇప్పుడు ఉండదు. ఏడాది క్రితం నా శరీరం ఎలా ఉండేదో.. ఇప్పుడు అలా లేదు. నీల్ పుట్టాక వర్క్‌వుట్స్ చేయకుండా బాడీ రిలాక్స్ అయిపోయింది. డెలివరీ తర్వాత అప్పటి ఎనర్జీ లెవల్స్‌ని సాధించడం కష్టంతో కూడిన పనే. గుర్రాన్ని ఎక్కడం, దానిపై స్వారీ చేయడం ఇప్పుడు నాకు పెద్ద పనిలా అనిపించింది. అంతకు ముందు ఎక్సర్‌సైజ్ అంటే చాలా ఈజీగా అనిపించేది. ఇప్పుడు బాడీ దానికి సహకరించట్లేదు. గర్భం దాల్చడం, ప్రసవించిన తర్వాత శరీరంలో మార్పులు రావడం సహజం. కానీ మనలో నేర్చుకోవాలనే తపనకు ఏదీ అడ్డంకి కాదు అని కాజల్ పేర్కొన్నారు. భారతీయుడు-2 సినిమా గురించి కూడా కాజల్ మాట్లాడారు. శంకర్ దర్శకత్వంలో ఈ చిత్రంలో నటించే అవకాశం రావడం ఆనందంగా ఉంది. త్వరలోనే సెట్‌లోకి జంప్ చేయబోతున్నా. కొత్త విషయాలు నేర్చుకుని వాటిని అలవాట్లుగా మార్చుకునేందుకు ప్రయత్నం చేస్తాను. నిరంతరం ఏదో ఒకటి నేర్చుకోవాలి అనేంతగా అవకాశాలు వస్తున్నాయని అన్నారు.

Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at **Panidhar PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
RNI.TELTEL/2016/ 73311, Cell:8897334003 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in